


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 28-06-2025 | సంపుటి - 24 | సంచిక - 56 | రూ : 4 | పేజీలు: 8


## మూడు విడతల్లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

- నేటి నుంచి ప్రారంభం
- జులై 1 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 6 నుంచి వెబ్ ఆప్షన్లు
- షెడ్యూల్ ఖరారు

**జూన్ 27, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మూడు విడతల్లో జరగనుంది. ఆగస్టు 18 నుంచి కళాశాలల్లో బ్రాంచీలు మార్చుకునే స్లైడింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

తరువాయి 2లో



## ద్విచక్ర వాహనంతో 2 హెల్మెట్లు తప్పనిసరి

- తయారీదారులకు కేంద్రం షరతు
- ముసాయిదా నిబంధనలు విడుదల
- త్రిచక్ర వాహనాలకు యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టం

జూన్ 27, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు 2025కి రెండు ముఖ్య సవరణలు ప్రతిపాదిస్తూ ముసాయిదా విడుదల చేసింది. ఈ నిబంధనలు అమల్లోకి వచ్చిన మూడోనెల నుంచి, ద్విచక్ర వాహన తయారీ సంస్థలు, వాహన కొనుగోలుదారుకు తప్పనిసరిగా 2 హెల్మెట్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. భారత ప్రమాణాల సంస్థ (ఐఎస్ఐ) ప్రమాణాలతో తయారుచేసిన హెల్మెట్లనే ద్విచక్రవాహనంతో పాటు దాని యజమానికి అందించాలి. 2026 జనవరి 1 నుంచి తయారయ్యే

తరువాయి 2లో



## కదిలిన జగన్నాథుని రథ చక్రాలు

- వేడుకగా విశ్వప్రసిద్ధ రథయాత్ర
- భక్తజన సంద్రంగా పూరీ

**జూన్ 27, గోపాలపూర్:** హరిబోల్, జై జగన్నాథ్ అన్న భక్తుల నినాదాల మధ్య శుక్రవారం ఒడిశాలోని పూరీలో జగన్నాథుని నందిఘోష్ రథం కదిలింది. లక్షల మంది భక్తుల రాకతో పూరీ దివ్యధామం జనసంద్రాన్ని తలపించింది. శ్రీక్షేత్ర యంత్రాంగం పర్యవేక్షణలో పురుషోత్తముని సేవలన్నీ నిర్ణీత వేళల్లో జరిగాయి. తెల్లవారుజాము 4 గంటలకే ఆలయం తలుపులు తెరిచిన సేవాయత్‌లు జగన్నాథుడు, బలభద్ర, సుభద్ర,

తరువాయి 2లో



## వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

- వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూల ఉత్పత్తి విలువలో 11వ స్థానం

- రాష్ట్రంలో తగ్గిన కూరగాయల సాగు
- పప్పు దినుసులు, పసుపు, మామిడిలోనూ తగ్గుదల
- కేంద్ర గణాంకశాఖ నివేదిక



**జూన్ 27, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూలఉత్పత్తి విలువలో తెలంగాణ 11వ స్థానంలో నిలిచింది. అన్నిరకాల ధాన్యాల ఉత్పత్తి విలువలో నాలుగో స్థానంలో నిలవగా.. వరి ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచింది. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు, పశుసంపదలో ఇప్పటికీ వెనుకబడి ఉంది. 13 ఏళ్లలో వరిలో 3 రెట్ల వృద్ధి నమోదు చేసింది. అన్ని రకాల ధాన్యాల ఉత్పత్తిలో ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్

తరువాయి 2లో



## చరిత్రను మలుపు తిప్పిన నేత పీవీ

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- రాజ్‌భవన్‌లో మాజీ ప్రధాని చిత్రపటం ఆవిష్కరణ

**జూన్ 27, హైదరాబాద్:** భారతదేశ ఆధునిక చరిత్రను విప్లవాత్మక రీతిలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మలుపు తిప్పారని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో శుక్రవారం మాజీ ప్రధాని చిత్రపటాన్ని గవర్నర్ ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక సరళీకరణను

తరువాయి 2లో

## మహిళా 'శక్తి' క్యాంటీన్లు



- కలెక్టరేట్లు, ఆసుపత్రులు, బస్టాండ్లలో 150కి పైగా ఏర్పాటు
- ఒక్కోచోట ఐదు నుంచి ఏడుగురు మహిళలకు ఉపాధి
- రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నడుస్తూ ఆర్థికాభివృద్ధికి ఊతం

**జూన్ 27 :** వరంగల్, సిరిసిల్ల, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సూర్యాపేట, మహబూబాబాద్: రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ఇందిరా మహిళా శక్తి' క్యాంటీన్లను స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలోని కొత్త కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, బస్టాండ్లు, పారిశ్రామిక ప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తూ సంఘాల మహిళలు ఆర్థిక పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో గత ఏడాది 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి తెలంగాణ సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కేరళ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అమలవుతున్న క్యాంటీన్లను అధ్యయనంచేసి, ఇక్కడా వాటి ఏర్పాటుకు సంకల్పించింది.

తరువాయి 2లో

## సీబీఎన్ సీఎంగా ఉంటే క్రిమినల్స్‌కు చోటులేదు...



- సాంకేతిక పరిజ్ఞానం వైపు పోలీసులు మళ్లడం శుభపరిణామం
- వివేకా హంతకులను అప్పుడే అరెస్టు చేస్తే మళ్లీ నేరాలు చేసేవాళ్లా?
- గుంటూరులో పోలీసుశాఖ ఏఐ హ్యాకథాన్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, గుంటూరు (నెహ్రూనగర్): 'పోలీసులు సంప్రదాయం నుంచి సాంకేతిక పరిజ్ఞానం వైపు మళ్లడం శుభపరిణామం. దేశంలో ఎవరూ చేయని విధంగా ఏపీ పోలీసులు హ్యాకథాన్ నిర్వహించడం అభినందనీయం. నేరాలు లేనిచోట అభివృద్ధి వేగవంతమవుతుంది. దీన్ని గుర్తించి సంఘ విద్రోహశక్తులపై ఉక్కుపాదం మోపాం. ఫ్యాక్షనిస్టులు, మాఫియా, రౌడీమూకలను కట్టడి చేశాం.

తరువాయి 2లో

## 'ఆరోగ్య ఆంధ్ర'కు కుప్పం నుంచే తొలి అడుగు !

- టాటా సంస్థ సహకారంతో డీఐఎన్‌సీ సేవలు
- మారుమూల ప్రాంతంలో ఉన్నా వైద్యుల సూచనలు పొందే వీలు

**జూన్ 27, చిత్తూరు, కుప్పం పట్టణం:** ఆరోగ్య ఆంధ్ర కల సాకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం నుంచే తొలి అడుగు వేశారు. రాష్ట్రప్రభుత్వం, టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ కేంద్రాన్ని (డీఐఎన్‌సీ) కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిలో నెలకొల్పారు. దీనికి నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీలు, 2 యూపీహెచ్‌సీలను అనుసంధానించి, ప్రయోగాత్మకంగా సేవలు ప్రారంభించారు. సీఎం

తరువాయి 2లో



# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్ దేశంలో అగ్రస్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా 201112 నుంచి 202324 వరకు వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పాదక విలువపై కేంద్ర గణాంకశాఖ నివేదిక విడుదల చేసింది. దేశ స్థూల ఆర్థికవ్యవస్థలో వ్యవసాయ, అనుబంధ రంగాలు దాదాపు 18 శాతం వాటాతో ఆహారభద్రత కల్పించడంతోపాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్నాయని తెలిపింది. అయితే గత 13ఏళ్లలో ఈ వాటా 18.5 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 17.8 శాతానికి చేరినట్లు పేర్కొంది. వ్యవసాయేతర రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, వ్యవసాయం కేంద్రంగా ఉపాధికల్పన, గ్రామీణ జీవనోపాధికి ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు వ్యవసాయ ఆధునికీకరణ చేపట్టాల్సిన అవసరముందని సూచించింది. నివేదికలోని ముఖ్యాంశాలివి..

**తెలంగాణలో పరిస్థితి..**

* 2023..24లో రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాల విలువ రూ.1.12 లక్షల కోట్లుగా వెల్లడైంది.
* కూరల్లో వినియోగించే టమోటా, ఉల్లిపాయ సాగు పడిపోయింది. 201112 నుంచి 202324 వరకు కూరగాయలు, పండ్ల ఉత్పత్తి విలువ రూ.10,357 కోట్ల నుంచి రూ.3,933.89 కోట్లకు తగ్గింది. దేశవ్యాప్తంగా వీటి విలువ పెరుగుతుండటం గమనార్హం.
* పత్తి, జూట్ ఇతర నార ఉత్పత్తుల విలువలో రాష్ట్ర వాటా 9.3 నుంచి 13 శాతానికి పెరిగింది. మసాలా దినుసుల ఉత్పత్తిలో ఏపీతో సమానంగా రెండింతల వృద్ధిని తెలంగాణ నమోదు చేసింది. గతంలో పసుపు విలువ రూ.1,132.85 కోట్లుగా ఉంటే.. ఇప్పుడది రూ.426.43కి తగ్గింది.
* పప్పుధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదక విలువ పడిపోయాయి. మూడేళ్ల క్రితం వరకు రూ.1,883 కోట్లు ఉంటే.. ఇప్పుడు రూ.1,176 కోట్లకు చేరింది.
* నూనెగింజలకు సంబంధించి వేరుసెనగ ఉత్పత్తి తగ్గిపోయింది. అలాగే చెరకు ఉత్పాదకత విలువ పడిపోయింది. పదేళ్ల క్రితం అది రూ.610.14 కోట్లు ఉంటే.. ప్రస్తుతం రూ.375.58 కోట్లకు చేరింది.
* మామిడి ఉత్పాదకత విలువ రూ.1,986.46 కోట్ల నుంచి రూ.1,314.92 కోట్లకు తగ్గింది. ద్రాక్ష, నిమ్మ తోటల పరిస్థితి అలాగే ఉంది. టమోటా ఉత్పాదకత విలువ గతంలో రూ.3,519 కోట్లు ఉంటే ఇప్పుడది రూ.435 కోట్లకు తగ్గింది.
* మాంసం ఉత్పత్తి విలువ రూ.9,224 కోట్ల నుంచి రూ.24,507 కోట్లకు పెరిగింది. గుడ్ల ఉత్పత్తి విలువ రూ.1,933.49 కోట్ల నుంచి రూ.3,964.52 కోట్లకు చేరింది.
* దేశంలో ఆర్థిక వ్యవస్థ విలువ రూ.274.13 లక్షల కోట్లు ఉంటే.. వ్యవసాయ, అనుబంధ రంగాల విలువ రూ.48.78 లక్షల కోట్లుగా ఉంది. గత 13 ఏళ్లలో ఈ రంగాలు 225% వృద్ధి నమోదు చేశాయి. 201112లో రూ.15.02 లక్షల కోట్లు ఉంటే.. 202324 నాటికి రూ.48.78 లక్షల కోట్లకు చేరింది.

# ద్విచక్ర వాహనంతో 2 హెల్మెట్లు తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

అన్ని త్రిచక్ర వాహనాలకు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టం అమర్చాలనీ ప్రతిపాదించింది. ఈ సిస్టం ఐఎస్14664:2010 నిబంధనలకు అనుగుణంగా ఉండాలని పేర్కొంది. ఈ రెండు సవరణలపై అభ్యంతరాలు, సూచనలు సలహాలు ఉంటే 30 రోజుల్లోపు commentsmorth@gov.in కి మెయిల్‌చేయాలని కేంద్ర రహదారి, రవాణాశాఖ తెలిపింది.

# చరిత్రను మలుపు తిప్పిన నేత పీవీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టడంలో, విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో, విద్యా రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో పీవీ చేసిన సేవలు అనుసరణీయమని ప్రశంసించారు. జులై 26న కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాజ్‌భవన్‌లో మాజీ ప్రధాని వాజ్‌పేయీ చిత్రపటాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీరజవాన్లను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్, అధికారులు పాల్గొన్నారు. రాజ్‌భవన్‌లో ఇప్పటికే మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ చిత్రపటాలు ఉండగా.. తాజాగా వాటి సరసన పీవీ చిత్రపటం చేరింది.

# మూడు విడతల్లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఎప్‌సెట్ ప్రవే శాల కమిటీ ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కన్వీనర్, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూలును ఖరారు చేశారు. ఫీజులకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాయాలని, అక్కడి నుంచి వచ్చే సమాచారం ఆధారంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ఆచార్య విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వర్‌రావు, ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య డీన్‌కుమార్, ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్రశేఖర్, ప్రవేశాల క్యాంపు అధికారి బి.శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

**తొలిసారి మాక్ సీట్ల కేటాయింపు**

* ఉన్నత విద్యా మండలి తొలిసారిగా మాక్ సీట్ల కేటాయింపు ప్రక్రియను ఈసారి ప్రవేశపెట్టింది. అందులో సీట్లు పొందిన తర్వాత అవసరమైతే వెబ్ ఆప్షన్లు మార్చుకోవచ్చు.
* తొలి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు మెరుగైన కళాశాల, మెరుగైన బ్రాంచి కోరుకునే పక్షంలో రెండో విడతలో మళ్లీ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.
* రెండో విడత సీట్ల కేటాయింపు తర్వాత విద్యార్థులు తప్పనిసరిగా ఆయా కళాశాలల్లో స్వయంగా రిపోర్ట్ చేయాలి. ఆ సమయంలో ఒరిజినల్ టీసీ సమర్పించాలి. మిగిలిన విద్యార్హత ధ్రువపత్రాలు జిరాక్స్‌వి సమర్పిస్తే సరిపోతుంది.
* రెండో విడత కౌన్సెలింగ్ వరకు సీట్లను రద్దు చేసుకోవచ్చు. చెల్లించిన ఫీజు మొత్తం వెనక్కి ఇస్తారు. చివరి విడతలో అలాంటి అవకాశం ఉండదు. ఫీజు తిరిగి ఇవ్వరు.
* గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ ప్రవేశాలు జరుపుకొనే వెసులుబాటు ఉంటుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఆగస్టు 23వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

# మహిళా 'శక్తి' క్యాంటీన్లు

(మొదటిపేజీ తరువాయి)

తొలి దశలో జిల్లాకు ఐదు చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించి..తొలుత కామారెడ్డి కలెక్టరేట్‌లో 2024 మార్చి 27న ప్రారంభించారు. మంచి ఫలితాలు రావడంతో క్రమంగా విస్తరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 150కిపైగా క్యాంటీన్లు మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. హనుమకొండ జిల్లాలోనే ఎనిమిది ఉన్నాయి.

**నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యం**

స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు రుణాలతో వీటిని ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతోపాటు అదనంగా పిండివంటలు, పచ్చళ్లు, ఊరగాయలు వంటివి విక్రయిస్తున్నారు. ఇందులో



ఆయా ఆహార పదార్థాల తయారీ దగ్గర్నుంచి, వినియోగదారులకు వాటిని అందించే వరకు అన్ని పనులూ సంఘ సభ్యులే స్వయంగా చూసుకుంటున్నారు. విక్రయాలతో వచ్చిన ఆదాయంతో నెలవారీ వాయిదాలు చెల్లించుకుంటున్నారు. వాయిదాలుపోనూ మిగిలిన సొమ్ముతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యమిస్తుండటంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.



# కదిలిన జగన్నాథుని రథ చక్రాలు

(మొదటిపేజీ తరువాయి)

సుదర్శనుడితో కూడిన సన్నిధిలో మంగళహారతి, మైలం, అబకాశ, గోపాలవల్లభ సేవలు నిర్వహించారు. తర్వాత పొహండి వేడుకలో భాగంగా చతుర్థామూర్తులకు చాలమాల, సెనాపట అలంకరించారు. 10.40 గంటలకు ప్రారంభమైన పొహండి 12.10 గంటలకు ముగిసింది. రథాలు అధిరోహించిన దారు విగ్రహాల సన్నిధిలో ఇతర సేవలు కొనసాగాయి. మధ్యాహ్నం 2.05 గంటలకు పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి శిష్యగణంతో రథాలపైకి వచ్చి పూజలు చేశారు. పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ ఆనవాయితీ ప్రకారం చతుర్థామూర్తుల సన్నిధిలో బంగారు చీపురుతో చెరా పహరా చేసి, కస్తూరి కల్లాపి చల్లి హారతులిచ్చారు. అనంతరం రథాలకు అశ్వాలు, సారథులు అమర్చి తాళ్లు కట్టారు. తొలుత 4.10 గంటలకు బలభద్రుని తాళధ్వజ రథం యాత్రగా బొడొదండొ మీదుగా గుండిచాదేవి ఆలయం వైపు కదిలింది. దేవీ సుభద్ర దర్పదళన్, చివరిగా పురుషోత్తముని నందిఘోష్ రథాలు అమ్మ మందిరానికి కదిలాయి. భక్తులు జగన్నాథుడిని స్మరిస్తూ రథాలు లాగేందుకు పోటీపడ్డారు. చీకటిపడే వరకూ రథయాత్ర సాగింది. 7.10 గంటలకూ రథాలు గుండిచాదేవి మందిరానికి చేరుకోకపోవడంతో యాత్రను మధ్యలోనే నిలిపివేశారు. నేడు నిలిపివేసిన చోటు నుంచే యాత్ర మళ్లీ ప్రారంభించి.. రథాలను గుండిచా మందిరానికి చేర్చనున్నారు.

# సీబీఎన్ సీఎంగా ఉంటే క్రిమినల్స్‌కు చోటులేదు

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక పరిజ్ఞానంపై ఎంత శ్రద్ధ పెట్టానో శాంతిభద్రతలు కాపాడటానికీ అంతే ప్రాధాన్యం ఇచ్చా. సీబీఎన్ సీఎంగా ఉంటే రాష్ట్రంలో క్రిమినల్స్‌కు చోటు లేదు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఆంధ్రప్రదేశ్‌ను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి' అని పోలీసులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. గుంటూరు శివారులోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏఐ హ్యాకథాన్ మూడురోజుల సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు కళాశాలలో ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. హ్యాకథాన్‌లో పాల్గొన్న ఐటీ కంపెనీల ప్రతినిధులు, ఏఐ నిపుణులతో వారి ఆవిష్కరణలపై చర్చించారు. అనంతరం హ్యాకథాన్‌లో పోలీసులు, విద్యార్థులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు.

**ఏఐలో ఇది ఆరంభమే**

'ఏఐ విషయంలో ఇది ఆరంభమే. ప్రజల డేటాను ఏఐతో విశ్లేషించి సమస్యలకు పరిష్కారం చూపాలి. ఒకప్పుడు కృత్రిమ ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలు ప్రభుత్వస్థాయిలో ఉండేవి. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులూ తయారుచేస్తున్నారు. స్పేస్ సిటీ ఏర్పాటుద్వారా మనమే సొంతంగా ఉపగ్రహ ప్రయోగాలు చేసే అవకాశం కల్పిస్తాం. గతంలో ఐటీ గురించి మాట్లాడినట్లు ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ... ఇక్కడ క్వాంటమ్ వ్యాలీ. థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ... వర్క్ లోకల్లీ అనే నినాదం అందిపుచ్చుకోవాలి'' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**మేధోశక్తితో తెలివిగా పనిచేయాలి**

'రేపు జరిగేది ఈరోజే ఆలోచిస్తా. ప్రస్తుతం పనితీరు మారింది. ఇంటివద్దే పనిచేసే వెసులుబాటు వచ్చింది. నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువారు నంబర్ వన్‌గా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నా. ఐఓటీ, రోబో, సెన్సర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజాజీవనం సులువైపోయింది. ర్యాపిడో వ్యవస్థాపకులు గుంటూరుకు చెందిన వారే. యాప్ ద్వారా వాహన యజమానులు, ప్రయాణికులను అనుసంధానం చేస్తున్నారు. ఇలా వినూత్నంగా ఆలోచిస్తే ప్రపంచాన్ని పాలించే అవకాశం మన ముందే ఉంది. ఏఐ వస్తే ఉద్యోగాలు పోతాయని కొందరు అంటున్నారు. అది సరికాదు. రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేస్తున్నాం. స్మార్ట్ వర్క్ నేర్చుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోనూ డేటాబ్యాంక్ ఉంటుంది. అది సంపద. గతంలో ఐటీని ప్రమోట్ చేశాం. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ ద్వారా తెలుగువారి సత్తా చాటబోతున్నాం'' అని చంద్రబాబు ఆకాంక్షించారు.

# 'ఆరోగ్య ఆంధ్ర'కు కుప్పం నుంచే తొలి అడుగు !

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు ఈ సేవలకు వచ్చే నెలలో లాంఛనంగా శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం చిత్తూరు జిల్లా, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు.

**భద్రంగా ఆరోగ్య చరిత్ర**

ముందుగా పీహెచ్‌సీలకు వచ్చే రోగుల వివరాలన్నింటినీ డిజిటలైజ్ చేస్తారు. ఆరోగ్యసమస్య, చికిత్స చేసిన వైద్యుడి పేరు, వాడిన, వాడుతున్న ఔషధాల వివరాలు కంప్యూటర్‌లో నమోదుచేస్తారు. దానికో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించి రోగికి ఇస్తారు. భవిష్యత్తులో ఆ వ్యక్తి వేరే ఏదైనా ఆసుపత్రికెళ్లినా... తన ఐడీ వైద్యుడికి చెబితే చాలు. వైద్యుడు ఆ వ్యక్తి 'హెల్త్ హిస్టరీ' తెలుసుకొని, మెరుగైన చికిత్స అందిస్తారు. ఒక్కసారి వివరాలు డిజిటల్ అయితే.. నెర్వ్ కేంద్రం ద్వారా ఎక్కడున్నా వైద్యుల సూచనలు పొందొచ్చు. గర్భిణులు, బాలింతల సేవలపై నెర్వ్ కేంద్రం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను అప్రమత్తం చేస్తుంది. నెర్వ్‌కేంద్రాల్లో వైద్యులు, ఏఎన్ఎంలు నిత్యం అందుబాటులో ఉంటారు. ఈ కేంద్రాల ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

**వర్చువల్‌గా వైద్యుల సూచనలు**

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 30.90 లక్షల మంది డీఐఎన్‌సీ సాయం పొందారు. రోగి మారుమూల ప్రాంతంలో ఉన్నా.. వీడియోకాల్ ద్వారా వైద్యులతో మాట్లాడుతున్నారు.



1.17 లక్షల మంది వర్చువల్ పద్ధతిలో వైద్యుల సూచనలు, తీసుకున్నారు. నెర్వ్ కేంద్రానికి కాల్ చేసి రోగి ఐడీ చెప్పగానే వైద్యులు వివరాలు పరిశీలించి, సమస్య తెలుసుకొని సూచనలు అందజేస్తున్నారు. కర్ణాటకలోని కోలారు జిల్లా, హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పురంలతోపాటు చెన్నై, కోల్‌కతా, గువాహటిలోనూ ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. మంత్రులు లోకేశ్, సత్యకుమార్ గతేడాది కోలారు వెళ్లి డీఐఎన్‌సీలను పరిశీలించారు.

# ఆంధ్రప్రదేశ్ లాంటి ప్రదేశం ప్రపంచంలో మరోటి లేదు

* **ప్రపంచపటంలో ఆంధ్రప్రదేశ్‌ను పైకి తేవాలంటే చంద్రబాబే కావాలి: రాందేవ్ బాబా**

అమరావతి: 'వియత్నాం, స్విట్జర్లాండ్, యూరప్ అని ఎక్కడెక్కడో తిరుగుతుంటాం కానీ, ఆంధ్రప్రదేశ్ లాంటి పర్యాటక గమ్యస్థానం ప్రపంచంలో మరెక్కడా లేదు' అని ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా అన్నారు. 'ఇతర రాష్ట్రాలను నేను కించపరచడం లేదు. కానీ, ఏపీలో ఉన్న సుందరమైన అటవీప్రాంతం, సముద్ర తీరం, వైవిధ్యమైన వాతావరణం దేనికదే ప్రత్యేకం. గుజరాతీలు, మరాఠీలను, హిందీ మాట్లాడేవారినీ ఏపీలో పర్యటనలకు తీసుకొస్తా. ఏపీ పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు నేను సిద్ధం' అని ప్రకటించారు. శుక్రవారం



విజయవాడలో జరిగిన టూరిజం కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడారు.

**అంబానీల్లాగా పెళ్లి చేసుకునేలా..**

'అంబానీల్లాగా పెళ్లి చేసుకోవాలనే కోరిక చాలామందికి ఉండవచ్చు. అలాంటి వారందరికీ నచ్చేలా దిండిలో వెడ్డింగ్ డెస్టినేషన్ క్రూజ్‌ను ఏర్పాటుచేస్తాం. వేదపండితులు, పూజసామగ్రి, మ్యూజిక్ వంటివన్నీ సమకూరుస్తాం. దిండి ఒక పెద్ద వెడ్డింగ్ డెస్టినేషన్ అవుతుంది. రాబోయే రోజుల్లో ప్రపంచం మొత్తమ్మీద వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్ అవుతుంది. అందుకు అవసరమైన మార్కెటింగ్‌ను నేనే ఉచితంగా చేస్తా' అని బాబా హామీనిచ్చారు.

* **ప్రపంచ పటంలోకి హార్సిలీ హిల్స్‌ని తెస్తాం**

'హార్సిలీ హిల్స్‌ను ఐకానిక్ వెల్‌నెస్ కేంద్రంగా ప్రపంచపటంలోకి తీసుకొస్తాం. ఏపీలో ఏమైనా చేద్దామని ఆలోచిస్తుండగా.. చంద్రబాబు నాతో మాట్లాడారు. వెల్‌నెస్ సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు. రూ.500 కోట్లకు పైగా పెట్టుబడితో వెల్‌నెస్ సేవలను తీసుకొస్తాం' అని బాబా తెలిపారు.

* **సూర్యలంకలో ప్రపంచస్థాయి వెల్‌నెస్ కేంద్రం**

బాపట్ల: బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో ప్రపంచస్థాయి వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు రాందేవ్‌బాబా తెలిపారు. సూర్యలంక తీరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పర్యాటక శాఖ బీచ్ రిసార్టులు, బీచ్ వద్ద భూములను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చేలా గొప్ప వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించి త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సూర్యలంకకు చాలా పెద్ద ప్రాజెక్టు వస్తుందని తెలిపారు. సంస్థ సీఈవో బాలకృష్ణ కూడా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అంటేనే రైతుల పార్టీ

* **కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**
* **బంధనకల్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ అంటేనే రైతుల పార్టీ అని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో ముస్తాబాద్ మండల కేంద్రంలోని బందనకల్ గ్రామంలో రైతులతో కలిసి సంబరాలు కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిఎంరేవంత్ రెడ్డి, సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు సిఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి నుండి ఈనాటి సిఎం రేవంత్ రెడ్డి వరకు రైతులకు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలని లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన సంవత్సర కాలంలోనే రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చి చేసి చూపించామని అన్నారు. రాష్ట్రంలోని దాదాపు 30 లక్షల వరకు రైతులకు దాదాపు 25 వేల కోట్ల వరకు రుణాలు మాఫీ అయ్యాయని అన్నారు. అలాగే రైతు భరోసా కింద పంట పెట్టుబడి సహాయం ఇంతక ముందు ప్రభుత్వం ఇచ్చినట్లుగా రాళ్ళకు, గుట్టలకు, వెంచర్స్‌కి రోడ్లకు కాకుండా పండిరచే ప్రతి రైతుకు లబ్ది చేకూర్చాలి అనే ఉద్దేశంతో వ్యవసాయ అధికారులతో మళ్లీ సర్వే చేయించి కేవలం పంట పండిరచే రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. సన్న వడ్లు పండిస్తే క్వింటాలకు 500 చొప్పున బోనస్ చెల్లించడం, ఇలాంటి రైతులకు



మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేపట్టడం గర్వకారణమని, ఈ ఘనత దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ విధంగా ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తూ అటు సంక్షేమం ఇటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తెలంగాణ రైసింగ్ నెంబర్ 1 విజన్ 2047తో ముందుకు వెళుతుంటే ఇది ఓర్వలేని బిఆర్ఎస్ నేతలు వారి స్థాయిని మరచి అహంకారంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. మళ్ళీ ఇంకోసారి కాంగ్రెస్ పార్టీపైన గాని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన కానీ ఇష్టానుసారంగా మాట్లాడితే నాలుక చీరేస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంధనకల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుపాకుల శ్రీనివాస్ తదితరులున్నారు.

## లూయిస్ బ్రెయిలీ భవనంలో ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీలో గల లూయిస్ బ్రెయిలీ భవనంలో శుక్రవారం వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి, నార్త్ సిటీ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేష్ ముదిరాజ్, బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ వినోద్ జాదవ్, లయన్స్ క్లబ్ సభ్యులు టి. రాజేంద్రప్రసాద్, డిస్ట్రిక్ట్ గవర్నర్ లు పాల్గొన్నారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ భవనంకు 50 కుర్చీలు , వాటర్ ఫిల్టర్ ను అందజేశారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ వారి ఆధ్వర్యంలో ఇటీవల జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో ఉత్తీర్ణత సాధించి ఎస్ఎస్సీ పూర్తి చేసుకున్న నలుగురు విద్యార్థులకు దామోదర్ రెడ్డి జ్ఞాపకార్థం చెక్కుల పంపిణీ చేయగా 1 వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉతీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్లా శ్రీనివాస్ రెడ్డి, రిటైర్డ్ జడ్పి హెచ్ఎస్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, సూరారం కాలనీ హై స్కూల్ , ఆంగ్ల ఉపాధ్యాయుడు పుస్తక రచయిత హనుమంతరావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ గౌడ్, శ్రీహరి, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంఘ సభ్యులు అధ్యక్షులు అంజయ్య గౌడ్, కార్యదర్శి నరేందర్ రెడ్డి, సత్యం, వెంకటరామయ్య, శేఖర్ గౌడ్, ఆంజనేయులు, రమ, యు అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సందర్శన



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ను శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మిక సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రా సేనారెడ్డి,ఎస్సై శివరామకృష్ణ , సిబ్బంది పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నాం

**: ఎమ్మెల్యే కూనంనేని**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సుజాతనగర్ మండల పరిధిలో అభివృద్ధి పనుల మహోత్సవం హోట్టహాసంగా జరిగింది. స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఎనిమిది పంచాయతీల పరిధిలో పూర్తయిన 18 అభివృద్ధి పనులను ప్రారంభించారు, మరో 14 అభివృద్ధి పనులకు ఒక్కరోజే శంకుస్థాపన చేశారు. సర్వారం, కోయగూడెం, బేతంపూడి, జామ్లా తండా, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, నర్సింహా సాగర్, సింగభూపాలెం పంచాయతీల పరిధిలో పరిధిలో రూ.1.30 కోట్లతో పూర్తయిన రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులను ప్రారంభించారు, మరో రూ.1.87కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంబోచ్చవ సభల్లో కూనంనేని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వాటి పరిస్కారంకోసం కృషి చేస్తున్నామని, ఇప్పటికే 70 శాతం మేర గ్రామీణ



ప్రధాన రహదారులు, అంతర్గత రహాదారులు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక అవసరాలైన త్రాగునీరు, విద్యుత్, వైద్య సౌకర్యం వంటి వాటికి ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. మండలంలో త్రాగునీటి సమస్య పరిస్కారంకోసం మూడు ప్రాంతాల్లో రూ.1.38కోట్లతో నిర్మించనున్న సంపు, పంపు హౌస్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని, మరో రూ.30 లక్షలతో పైపు లైన్ల నిర్మాణం, పునర్నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రతి పంచాయతీకి పక్కా భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, వైద్యశాలలను బలోపేతం చేసేందుకు అత్యధిక నిధులు కేటాయిస్తున్న చెప్పారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మితమవుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు, పిఎసిఎస్ చైర్మన్ మండే మనుమంతరావు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడివో భారతి, అధికారులు శివయ్య, కిషన్, నర్మద, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు, కొమారి హేమంతరావు, కొమారి కృష్ణ, జక్కుల రాములు, నాయకులు పొదిలి శ్రీనివాస్, తాళ్లూరి పాపారావు, వేర్ల మల్లేష్, వీర్ల దుర్గాప్రసాద్, మూడు గణేష్, భూక్యా శ్రీను, మేకల వెంకటేష్, ఎర్రం రాజు, సురేష్, రఫీ, అనిల్, నాగేంద్రబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓసి ప్రభావిత ప్రాంతాల్లో యువతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

* **సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ. మధు డిమాండ్..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక పెనగడప గ్రామంలో సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు పాల్గొని మాట్లాడుతూ త్వరలోనే సింగరేణి ఓపెన్ కాస్ట్ లో బొగ్గు ఉత్పత్తి చేయడానికి సౌదా అనే కంపెనీ రాబోతుందని ఈ కంపెనీలో సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇదే ఓసి నందు వివిధ కంపెనీ లో గతంలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరికీ న్యాయం చేశారనే, మిగతా యువతకు ఉద్యోగం కల్పించాలని అన్నారు. స్తానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వకుండా, దరఖాస్తుల



పేరుతో వేరే ప్రాంతాల యువతను ఆకర్షించి లోపాయికరి ఒప్పందాలు చేసుకొని డబ్బులను సొమ్ము చేసుకునే పని చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇటువంటి భ్రమలో లో కల్పించే కంపెనీ ప్రకటనలు నమ్మొద్దని యువతకు పిలుపునిచ్చారు .యువకులకు ఉద్యోగాలి ఇప్పిస్తామని పేరుతో అడ్డదారులు తొక్కేందుకు అక్రమాలు చేసే వ్యక్తులను నమ్మొద్దని ఆయన అన్నారు. అక్రమాలకు పాల్పడే వ్యక్తులు తమరికి మోసం చేస్తే సిఐటియు సంఘ నాయకులకు దృష్టికి తీసుకురావాలని వారు కోరారు .స్థానిక యువతకు ప్రాధాన్యతనిచ్చి సి ఎస్ ఆర్ పాలసీని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యువకులను మోసం చేసే పద్ధతికి పాల్పడితే పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు .స్థానిక యువకులకు ఉద్యోగాలు ఇచ్చేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్య రమేష్ పప్పుల ప్రమోద్ సిఐటియు పెనగడప గ్రామ నాయకులు అల్లి నాగయ్య ,కట్ట శ్రీను, గణేష్, మాధవరావు, సురేష్ ,అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాట్ ఫారం మీద బ్రతికే కార్మికుల పై పంచాయతీ కన్ను

* **కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదు : మాస్ లైన్**

అశ్వరావుపేట, (ప్రజాస్ఫూర్తి) : పంచాయతీ వ్యవస్థ ప్లాట్ఫారం మీద బ్రతికే కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి పండూరి వీరబాబు హెచ్చరించారు. అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం దమ్మపేట రోడ్డు ఇరువైపులా పొట్టకూటికోసం డ్రైనేజీ మీద షాపులు పెట్టుకొని బ్రతికే కార్మికుల మీద పంచాయతీ కన్ను వేసి తక్షణమే ఖాళీ చేయాలని ప్రతి ఒక్క షాపుకు నోటీసులు పంపించారు. కార్మికులను వారి కుటుంబాలను రోడ్డు మీద పడేవేయాలని నిర్ణయించుకుందా అని ప్రశ్నిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్లాట్ ఫారం మీద బ్రతికే వారిని వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు పరిస్థితి ఏంటి? వారి జీవనోపాధి ఏంటి అని అన్నారు. కార్మికుల మీద కాదు మీ ప్రతాపం బడా బాబులు రోడ్డు పక్కల స్థలాలు ఆక్రమించుకున్న దొంగ పట్టాలు పుట్టించి వారి సొంత స్థలాలు లాగా చలామణి అవుతున్న వారి మీద చూపించాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న సంతపాకల స్థలంలో షెడ్యూల్ నిర్మించి ప్లాట్ఫారం మీద బ్రతికే వారికి ఆసరా కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లల్లో



ఎన్నో అవకతవకలు ఉన్నాయి ఇల్లు లేని వారి కంటే ముందుగా ఇల్లు ఉన్న వారికే రెండు మూడు ఇల్లు ఇవ్వడం వడ్డీ వ్యాపారస్తులకు పార్టీ కొమ్ము కాసే వారికి తప్ప, ఇల్లు లేని వారికి మొండిచేయి చూపించారు. ఇది ఒక ఎత్తు అయితే చనిపోయిన వారికి ఇల్లు కేటాయించడం ఇది మరీ విడ్డూరమన్నారు. మంత్రి శీనన్న మీరు చెప్పిన మాటలకు చేసే పనికి ఒక్కటి కూడా పొంతన లేవు గత ఆయాంలో ఇల్లు ఉన్న వారికి సర్వే చేసి అట్టి వారికి ఇల్లు ఇవ్వబొమన్నారు. అన్నా మరి మీ అనుచరులు దమ్ము పేటలో ఇల్లు లేని వారికి న్యాయం చేయకుండా వారికి వారే దోచుకుంటున్నారు ఇది ఎక్కడ న్యాయమని మండిపడ్డారు. ఇక్కడ డ్రైనేజీల మీద బ్రతికే వారిని ప్రత్యామ్యాయం చూపించాక అప్పుడు తొలగించమని అట్టి విధంగా కాకుండా వారిని వెంటనే తొలగిస్తే సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ చూస్తూ ఊరుకోదు అని హెచ్చరిస్తున్నారు.

## యు ఆర్ ఎస్ సిబ్బంది తో ప్రత్యేక సమావేశం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండల విద్యా శాఖాధికారి డాక్టర్ ప్రభుదయాల్ అర్బన్ రెసిడెన్షియల్ ప్రత్యేక పాఠశాల సకల సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించి ,ప్రత్యేక సంస్థ ఏర్పాడు లక్ష్య సాధనకై అంకితభావంతో కృషి చేయాలన్నారు.ఆయా అవసరతలుండే పిల్లలే ఈ ప్రత్యేక సంస్థలో ఉన్నందున వారి సంక్షేమం నిమిత్తం చిత్తశుద్ధితో సకల చర్యలు తీసుకుంటూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉండే నైపుణ్యాలను మెరుగుపర్చాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నందున అంకితభావంతో పనిచేయాలన్నారు.

## కోలన్ హన్మంత్ రెడ్డి ని కలిసిన గువ్వ రవి ముదిరాజ్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ సెల్ కన్వీనర్ గా షెక్ బిక్కన్ షా నియమితులైన సందర్భంగా శుక్రవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ గువ్వ రవి ముదిరాజ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, మహిళ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ షేక్ రఫీయాబేగమ్, 1వ డివిజన్ జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

* **చలమల్ల కృష్ణారెడ్డి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సంస్థాన్ నారాయణపురం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేర్చే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. భేదాభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, కార్యకర్తలు ఎవరు నిరుత్సాహపడకూడదన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం కృషి చేసిన వారికి రానున్న ఎన్నికల్లో అభ్యర్థులుగా అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక విషయంలో అవకతవకలను గుర్తించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కోరారు. మండల స్థాయిలో కొంతమంది నేతలు సంక్షేమ పథకాల అమలులో, భూ వివాదాల్లో జోక్యం చేసుకుంటూ అధికారులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా పార్టీని బలహీనపరిచేలా వ్యవహరించే వారిని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రోత్సహించరని కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు గూడూరు వెంకటరెడ్డి, రాసమల్ల యాదయ్య, బిట్టు సత్యనారాయణ, శ్రీను, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ కళాశాలలో శిక్షణ పొందుతున్న
# గిరిజన యువతకు వెల్డింగ్ మెషిన్స్,టూల్ కిట్స్ ను అందజేత

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్ స్కీం ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఐటిఐ కళాశాలలో పలు వృత్తులలో నైపుణ్యం సాధించిన యువకులకు వెల్డింగ్ మెషిన్స్,టూల్ కిట్స్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తమ చేతులు మీదుగా అందజేయడం జరిగింది.మొత్తం 10 యూనిట్లను అందజేయడం జరిగింది.ఒక్కో యూనిట్ ధర రూ.55,000లు తెలిపారు.ఐ.టి.ఐ.కాలేజీ,రుద్రంపూర్ నందు వెల్డింగ్ వర్క్ షాప్ లో స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీమ్ (ఎస్సీఏ) ద్వారా గత నెలలో కాట్స్,చైర్స్



, టేబుల్స్ (ఫర్నిచర్) ను వెల్డింగ్ వృత్తిలో నైపుణ్యం పొందిన గిరిజన యువతతో తయారు చేయించడం జరిగిందని కళాశాల యాజమాన్యం , అధికారులు ఎస్పీ కి వివరించారు.ఆ ఫర్నిచర్ ను బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కు,వెల్డింగ్ మిషన్స్ , టూల్ కిట్స్ ను వెల్డింగ్ ట్రైనీస్ కు శుక్రవారం డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది.అనంతరం ఐటిఐ కళాశాల నందు గల మెకానికల్, ఎలక్ట్రికల్, ఫిట్టర్ ,తదితర విభాగాలను ఎస్పీ సందర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే సరైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో మెలిగితే జీవితంలో విజయం సాధిస్తారని సూచించారు. వృత్తి నైపుణ్యంతో జీవితంలో విజయం సాధించి ఎంతో మందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. జిల్లాలోని ఆదివాసీ,గిరిజన యువత అభివృద్ధి వరకూ పోలీస్ శాఖ కూడా అన్ని రకాలుగా కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిరా , కొత్తగూడెం డీస్పీ రెహమాన్ , ఐ.టి.ఐ కాలేజీ ప్రిన్సిపాల్, డి ఆర్ డి ఏ ఏపిఎం వెంకయ్య,ఐ.టీ.ఐ కాలేజీ స్టాఫ్ ,వెల్డింగ్ ట్రైనీస్ పాల్గొన్నారు.




## అన్నపూర్ణ భోజన కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

* **త్వరలో రూ.5కే అల్పాహారం కూడా ప్రారంభం**
* **నాణ్యమైన భోజనం అందించేందుకు మెనూలో మార్పులు**
* **తాత్కాలిక షెడ్ల స్థానంలో శాశ్వత భవనాల నిర్మాణం**

హైదరాబాద్ పేదలు, శ్రామికుల ఆకలి తీరుస్తున్న రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాలు సమూల మార్పులకు సిద్ధమవుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కమిటీ తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం, ఈ కేంద్రాల పేరును 'ఇందిరా క్యాంటీన్లు'గా మార్చనున్నారు. కేవలం పేరు మార్పుకే పరిమితం కాకుండా, సేవలను విస్తరించి, సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు చేపట్టబోతున్నారు. ప్రస్తుతం మధ్యాహ్నం మాత్రమే భోజనం అందిస్తున్న ఈ కేంద్రాల్లో, త్వరలోనే రూ.5కే ఉదయం అల్పాహారం కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు మరింత పౌష్టికాహారం అందించే లక్ష్యంతో భోజనం మెనూను కూడా మార్పు చేస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం, ప్రతి ప్లేట్‌లో 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల సాంబార్, 100 గ్రాముల కూర, 15 గ్రాముల పచ్చడి ఉండేలా చూస్తారు. ప్రస్తుతం చాలా అన్నపూర్ణ కేంద్రాలు తుప్పు పట్టిన రేకుల షెడ్లలో, పాడుబడిన గదుల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, వాటిని శాశ్వత భవనాల్లోకి మార్చాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక ఆధారంగా పనులు చేపట్టనుంది. భవిష్యత్తులో ఏర్పాటు చేసే క్యాంటీన్లతో పాటు, ప్రస్తుత కేంద్రాల్లో కూడా ప్రజలు కూర్చుని తినేందుకు వీలుగా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని యోచిస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కిరణ్ కుమార్ రెడ్డి ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అన్నపూర్ణ కేంద్రాలను ప్రారంభించింది. ఆ తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేంద్రాల సంఖ్యను పెంచినప్పటికీ, పేరును మాత్రం మార్చలేదు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ కేంద్రాలకు దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పేరు పెట్టాలని నిర్ణయించింది. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు దాదాపు 10 కోట్ల భోజనాలను పేదలకు అందించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా, కరోనా లాక్‌డౌన్ సమయంలో లక్షలాది మంది వలస కార్మికులు, పేదల ఆకలిని ఈ క్యాంటీన్లు తీర్చాయని గుర్తుచేశారు. ఈ మార్పులతో ఇందిరా క్యాంటీన్లు నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ : రేపటి నుంచే స్లాట్ బుకింగ్ ప్రారంభం

* **తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల**
* **మొత్తం మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తి**
* **శనివారం నుంచి జులై 7 వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం**
* **జులై 18 నాటికి తొలి దశ సీట్ల కేటాయింపు పూర్తి**
* **జులై 25 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం**



తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోరుకుంటున్న విద్యార్థుల కోసం ఒక ముఖ్యమైన ప్రకటన వెలువడింది. తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ సంవత్సరం ప్రవేశ ప్రక్రియను మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా, స్లాట్ బుకింగ్ ప్రక్రియ శనివారం (జూన్ 28) ప్రారంభమై జులై 7వ తేదీ వరకు కొనసాగుతుంది. విద్యార్థులు తమకు అనువైన స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత, జులై 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థులు ఎంచుకున్న ఆప్షన్ల ఆధారంగా, జులై 14, 15 తేదీల్లో మాక్ సీట్ల కేటాయింపు ఉంటుంది. జులై 18వ తేదీలోపు మొదటి విడత సీట్లను కేటాయించి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేస్తారు. మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత, రెండవ విడత ప్రక్రియను జులై 25 నుంచి ప్రారంభించనున్నారు. రెండవ విడతలో భాగంగా జులై 26న ధృవపత్రాల పరిశీలన ఉంటుంది. అదేవిధంగా, జులై 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం ఇస్తారు.

## హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్..
# ప్రారంభానికి ముందే కేటీఆర్ ఆసక్తికర ట్వీట్

* **శనివారం గచ్చిబౌలి- కొండాపూర్ ఫ్లైఓవర్ ప్రారంభం**
* **ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
* **ఫ్లైఓవర్‌కు కాంగ్రెస్ నేత పీజేఆర్ పేరు ఖరారు**
* **ఇది తమ ప్రభుత్వ ఘనతేనన్న మాజీ మంత్రి కేటీఆర్**
* **ఎస్ఆర్డీపీ కింద 36 ఫ్లైఓవర్లు మేమే కట్టామన్న కేటీఆర్**
* **మిగిలినవి పూర్తి చేయాలంటూ కాంగ్రెస్‌పై సెటైర్లు**

హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం కలిగించేందుకు మరో కీలక ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు నిర్మించిన ఈ మల్టీ లెవెల్ ఫ్లైఓవర్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అయితే ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు, ఈ



ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఫ్లైఓవర్ నిర్మాణం క్రెడిట్ తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం**

శనివారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న ఈ ఫ్లైఓవర్‌కు, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత పి. జనార్ధన్ రెడ్డి గౌరవార్థం "పీజేఆర్ ఫ్లైఓవర్"గా నామకరణం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఇది మా ప్రభుత్వ ఘనత: కేటీఆర్**

ఈ ఫ్లైఓవర్ ప్రారంభంపై కేటీఆర్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్డీపీ) కింద నిర్మించిన మరో కీలక ప్రాజెక్టు అందుబాటులోకి రావడం గర్వంగా, సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ పౌరుల తరపున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. తమ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు 42 ఫ్లైఓవర్లకు ప్రణాళికలు రూపొందించామని, వాటిలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని కేటీఆర్ గుర్తుచేశారు. మరో 6 ప్రాజెక్టులు 2024 నాటికి పూర్తి కావాల్సిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. "మిగిలిన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం వారి పాలనాకాలం పూర్తయ్యేలోపు అయినా పూర్తి చేయాలని కోరుకుంటున్నాను" అంటూ ఎద్దేవా చేశారు.

## మావోయిస్టుల ఆరోపణలపై మంత్రి సీతక్క స్పందన

* **మావోల ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి**
* **జీవో 49ను తాను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నానని స్పష్టం**
* **ఆదివాసుల జోలికి వెళ్లొద్దని అటవీ అధికారులకు ఆదేశాలిచ్చామన్న సీతక్క**

ఆదివాసీల హక్కుల విషయంలో మావోయిస్టులు చేసిన ఆరోపణలపై తెలంగాణ మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తాను ఎన్నడూ మరచిపోలేదని, ఆదివాసీల పక్షాన నిలబడతానని ఆమె స్పష్టం చేశారు. ములుగులో విలేకరులతో మాట్లాడిన ఆమె, మావోయిస్టులు తనపై చేసిన విమర్శలను ఖండించారు. ఎవరైనా సరే వాస్తవాలు మాట్లాడాలని మావోయిస్టులకు పరోక్షంగా హితవు పలికారు. వివాదాస్పదంగా మారిన జీవో నంబర్ 49ను తాను వ్యతిరేకించిన విషయాన్ని మంత్రి సీతక్క గుర్తుచేశారు. "ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే జీవో 49ను నేను వ్యతిరేకించాను. ఈ విషయంపై మా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చించాను. అడవిలో ఆదివాసుల జోలికి వెళ్లవద్దని, వారిని ఇబ్బంది పెట్టవద్దని నేను, మరో మంత్రి కొండా సురేఖ కలిసి అటవీశాఖ అధికారులకు చాలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం" అని ఆమె వివరించారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అధికారులు మాత్రమే నిబంధనలు అతిక్రమిస్తున్నారని, మిగతా వారెవరూ ఆదివాసీలను ఇబ్బంది పెట్టడం లేదని ఆమె తెలిపారు. అంతకుముందు, మావోయిస్టులు మంత్రి సీతక్కకు ఒక లేఖ రాశారు. ఒకప్పుడు ఉద్యమంలో పనిచేసిన సీతక్క, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉండి ఆదివాసీల హక్కులను



గాలికొదిలేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కుల ఉల్లంఘనకు ఆమెదే పూర్తి బాధ్యత అని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా, కుమురం భీమ్ జిల్లాలో 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం జీవో 49ను తీసుకొచ్చిందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకే ఈ జీవోను రూపొందించారని విమర్శించారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి తన వైఖరిని స్పష్టం చేశారు.

## విషయం లేనందువల్లే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారు

**: హరీశ్ రావు**

బనకచర్ల ప్రాజెక్ట్ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) పేరుతో సీఎం కేవలం కాలయాపన చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ పీపీటీ కేవలం కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కోసమే ఇచ్చారని, ఇది ఓ నాటకమని మండిపడ్డారు. 2016 నాటి అజెండా మినిట్స్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆనాటి సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్ కేవలం ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే అన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ



ప్రతిపాదననూ ఒప్పుకునేది లేదని కేసీఆర్ ఆనాడే స్పష్టం చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో, బనకచర్ల విషయంపై జరగబోయే కేంద్ర జలశక్తి సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తన వాదనలను బలంగా వినిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం లేనందువల్లే సీఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారని హరీశ్ రావు విమర్శించారు. "బేసిన్‌కు, బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి" అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసిందని అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పాటు కాలేదని, టెండర్లు కూడా పిలవలేదని ఆయన స్పష్టం చేశారు.

# స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోవద్దు : జైశంకర్

ఒకే ఒక్క కుటుంబం వల్ల దేశంలో అత్యయిక పరిస్థితి ఏర్పడిందంటూ కేంద్ర మంత్రి జైశంకర్ కాంగ్రెస్‌ను పరోక్షంగా దుయ్యబట్టారు. కుర్చీ కోసం వారు ఏదైనా చేస్తారంటూ విమర్శలు గుప్పించారు. ఎమర్జెన్సీ ప్రకటించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ హయాంలో విధించిన ఎమర్జెన్సీ వల్ల దేశవ్యాప్తంగా చాలామంది జైళ్లలో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు.



దేశంలో కాంగ్రెస్ హయాంలో అవినీతి పెరిగిపోవడం, ద్రవ్యోల్బణం ఎక్కువవడం వల్ల ప్రభుత్వానికి ప్రజాదరణ బాగా పడిపోయిందని జైశంకర్ అన్నారు. స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోవద్దనే పాఠాన్ని అత్యవసర పరిస్థితి నుంచి దేశం నేర్చుకుందని అన్నారు. అంతర్గత కారణాల వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు పేర్కొంటూ నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ 50 ఏళ్ల క్రితం 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించారని జైశంకర్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ భారత రాజ్యాంగ విలువలను పక్కనపెట్టిందని.. ప్రజల ప్రాథమిక హక్కులు నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పట్లో దేశ పౌరులు, పత్రికల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ తీవ్ర అణచివేతకు గురయ్యాయని, సుమారు 1.5 లక్షల మంది జైలు పాలైనట్లు తెలిపారు. అందువల్లే జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా జరుపుకున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు రాజ్యాంగాన్ని పట్టుకొని ప్రజల్లో తిరుగుతారే కానీ.. వారి ఉద్దేశాలు మాత్రం రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ఉంటాయని విమర్శించారు. తాము చేసిన తప్పుల గురించి కాంగ్రెస్ నేతలు ఎప్పుడూ విచారం వ్యక్తంచేయరని.. వారి నిర్ణయాలు తప్పని ఒప్పుకోరని దుయ్యబట్టారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితికి 50 ఏళ్లు పూర్తవడంతో నాటి పరిస్థితులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించింది. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, ఎమర్జెన్సీ నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించినట్లు కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇందులోభాగంగా అత్యవసర పరిస్థితికి సంబంధించిన అన్ని చట్టపరమైన రికార్డులను సేకరించి.. భావితరాల కోసం వాటిని భద్రపరచాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు.

## ప్రపంచ పోలీసు క్రీడలకు ఆతిథ్య దేశంగా భారత్ ఎంపిక: అమిత్ షా



దిల్లీ: ప్రతిష్టాత్మకమైన 2029 ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలకు ఆతిథ్య దేశంగా భారత్ ఎంపికైనట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా ఈ క్రీడలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ అవకాశం దక్కడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. ''పోలీసు క్రీడల నిర్వహణకు భారత్ ప్రతిష్టాత్మక బిడ్‌ను గెలుచుకొంది. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన విస్తారమైన క్రీడా మౌలిక సదుపాయాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. 1985 నుంచి రెండేళ్లకు ఒకసారి ప్రపంచ పోలీసు, అగ్నిమాపక కీడ్రలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 20 సార్లు ఈ పోటీలు జరిగాయి. అమెరికా 8, కెనడా 5, యూరప్ 4, బ్రిటన్ 2, చైనా ఒకసారి ఈ క్రీడలు నిర్వహించాయి. 2007 నుంచి 2023 వరకు భారత పోలీసు సిబ్బంది 1400 పతకాలు గెలుచుకున్నారు'' అని అమిత్ షా వివరించారు.



## ఎయిరిండియా విషాదం వేళ 'ఆఫీస్ పార్టీ'.. నలుగురు ఉద్యోగులపై వేటు!

అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోయిన దుర్ఘటనలో 275 మంది ప్రాణాలు కోల్పోవడం యావత్ ప్రపంచాన్ని కలచివేసింది. ఈ విషాద ఘటన నుంచి తేరుకోక ముందే (10 రోజుల్లోనే) ఎయిరిండియా గ్రౌండ్ సేవల సిబ్బంది ఆఫీసులో పార్టీ చేసుకోవడం తీవ్ర విమర్శలకు కారణమైంది. దీంతో చర్యలకు ఉపక్రమించిన సదరు సంస్థ.. నలుగురు సీనియర్ ఉద్యోగులపై వేటు వేసినట్లు పేర్కొంది. ''అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబీకులకు మేం సంఘీభావంగా నిలుస్తాం. ఈ క్రమంలో ఇటీవల ఆఫీసులో చోటుచేసుకున్న ఓ వ్యవహారానికి చింతిస్తున్నాం. ఆ ప్రవర్తన మా విలువలకు అనుగుణంగా లేదు. బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నాం'' అని ఏఐఎస్ఏటీఎస్ ఓ ప్రకటనలో తెలిపింది. సింగపూర్ కేంద్రంగా పనిచేసే ఎస్ఏటీఎస్ లిమిటెడ్ (గతంలో సింగపూర్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ సర్వీసెస్) ఎయిరిండియా భాగస్వామ్యంతో (AISATS) దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో ఫుడ్, బ్యాగేజ్ హ్యాండ్లింగ్ వంటి గ్రౌండ్ సేవలందిస్తోంది. అయితే, గుజరాత్‌లో విమాన దుర్ఘటన జరిగిన కొన్ని రోజులకే.. గురుగ్రామ్‌లోని ఏఐఎస్ఏటీఎస్ కార్యాలయ సిబ్బంది ఓ పార్టీ చేసుకున్నారు. సిబ్బందితో కలిసి సీనియర్ ఉద్యోగులు కూడా డీజేకు స్టెప్పులు వేస్తూ డ్యాన్సులు చేశారు. వీటికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వైపు మృతదేహాల కోసం బాధిత కుటుంబాలు రోజుల తరబడి వేచిచూస్తుంటే వీళ్లు మాత్రం ఎంజాయ్ చేస్తున్నారని నెటిజన్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. తాజాగా దీనిపై స్పందించిన సదరు సంస్థ.. నలుగురు సీనియర్ ఉద్యోగులను రాజీనామా చేయాలని ఆదేశించడంతోపాటు మిగతా వారిని హెచ్చరించినట్లు తెలిసింది.

## అమెరికా ప్రభుత్వానికి బిల్ గేట్స్ హెచ్చరిక!



మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ అమెరికా ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్రమైన హెచ్చరికలు చేశారు. ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాలకు అమెరికా ప్రభుత్వం నిధులలో కోత విధించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన 25 ఏళ్ల ప్రపంచ ఆరోగ్య రంగ అనుభవంతో ఈ వాస్తవాలను వివరిస్తున్నానని స్పష్టం చేశారు. ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాలకు అమెరికా సహాయాన్ని తగ్గించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రఖ్యాత వైద్య పత్రిక 'లాన్సెట్' ప్రచురించిన ఒక అధ్యయనాన్ని బిల్ గేట్స్ ఉటంకించారు. ఈ నిధుల కోత ఇలాగే కొనసాగితే, 2040 నాటికి అదనంగా 80 లక్షల మంది చిన్నారులు ఐదేళ్లలోపే మరణించే ప్రమాదం ఉందని ఆ అధ్యయనం తేల్చిందని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. "80 లక్షల సంఖ్య ఎంత పెద్దదో చెప్పాలంటే.. కాలిఫోర్నియా, టెక్సాస్, ఫ్లోరిడా, న్యూయార్క్, పెన్సిల్వేనియా, ఒహియో రాష్ట్రాల్లోని మొత్తం చిన్నారుల సంఖ్యతో ఇది సమానం" అని ఆయన పోల్చి చెప్పారు. ప్రపంచ ఆరోగ్య రంగంలో తాను గత 25 ఏళ్లుగా పనిచేస్తున్నానని, ఈ రంగంలో తనకు సాఫ్ట్‌వేర్ రంగంతో సమానమైన పరిజ్ఞానం ఉందని బిల్ గేట్స్ అన్నారు. "అమెరికా, ఇతర ప్రభుత్వాలు హఠాత్తుగా తమ సహాయ నిధులను నిలిపివేస్తే, మరింత మంది చిన్నారులు చనిపోతారనేది నాకు కచ్చితంగా తెలుసు. ప్రపంచ ఆరోగ్య సహాయం ఎన్నో ప్రాణాలను కాపాడుతుంది. ఎలాంటి ప్రణాళిక లేకుండా ఆ సహాయాన్ని ఉపసంహరించుకుంటే, ప్రాణనష్టం జరిగి తీరుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. తన గేట్స్ ఫౌండేషన్ ద్వారా ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలు, ప్రజారోగ్య నిపుణులతో కలిసి పనిచేసిన అనుభవాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. నిధుల కోత ప్రభావం ఇప్పటికే క్షేత్రస్థాయిలో కనిపిస్తోందని బిల్ గేట్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తాను నైజీరియా, ఇథియోపియా దేశాల్లో పర్యటించానని, అక్కడ క్షయ (టీబీ) వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మలేరియా నివారణ కార్యక్రమాలు మందగించడాన్ని స్వయంగా చూశానని తెలిపారు. ప్రాణాలను కాపాడే మందుల పంపిణీలో కూడా జాప్యం జరుగుతోందని ఆయన వివరించారు.

## కాళ్లు పట్టుకొని బతిమిలాడినా ఆ 'మృగాళ్లు' వదల్లేదు..
## న్యాయ విద్యార్థిని ఆవేదన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో మరో ఘోరం వెలుగుచూసింది. గతంలో ఆర్జీ కర్ వైద్య కళాశాలలో విద్యార్థినిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. తాజాగా న్యాయ కళాశాల ప్రాంగణంలోనే ఓ విద్యార్థిని (24) పై సామూహిక అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. దక్షిణ కోల్‌కతాలో కస్బా పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాయ కళాశాలలో ఓ విద్యార్థినిని బంధించిన కిరాతకులు దుర్మార్గానికి ఒడిగట్టారు. తనను వదిలేయాలంటూ ఆమె ఎంతగా ప్రాధేయపడినా కనికరం లేకుండా అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈ నేపథ్యంలో ఆ మృగాళ్ల నుంచి తనకు ఎదురైన భయానక పరిస్థితులను బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మోనోజిత్ మిశ్రా (31)ను కాళ్లు పట్టుకొని బతిమిలాడినా తనను వదిలిపెట్టలేదని.. పైగా ఈ దుశ్చర్యను వారు ఫోన్లలో రికార్డు చేశారని ఆమె వాపోయారు.



### బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని చెప్పినా..

మోనోజిత్ ప్రస్తుతం తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన తృణమూల్ కాంగ్రెస్ ఛత్ర పరిషత్ దక్షిణ కోల్‌కతా జిల్లా యూనిట్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని అతడు ప్రతిపాదించగా.. తనకు బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడంటూ ఆమె నిరాకరించడం వల్లే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. బాయ్‌ఫ్రెండ్‌కు హాని చేస్తానని, తన తల్లిదండ్రులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బెదిరిస్తూ కళాశాలలో బంధించాడని బాధితురాలు ఆరోపించారు. మరో ఇద్దరు విద్యార్థులు జుబీర్ అహ్మద్ (19), ప్రామిత్ ముఖర్జీ (20)లతో కలిసి తనపై దాడి చేయగా ప్రతిఘటించేందుకు ప్రయత్నించానని బాధితురాలు పేర్కొన్నారు.

### * వీడియోలు తీశారు.. హాకీ స్టిక్‌తో కొట్టారు..

''లైంగిక చర్య జరిపే ఉద్దేశంతో నన్ను బలవంతం చేయడానికి ప్రయత్నించారు. నేను నిరాకరిస్తూ.. దగ్గరికి రాకుండా ప్రతిఘటించి మోనోజిత్‌ని వెనక్కి నెట్టేశాను. ఏడుస్తూ వదిలిపెట్టాలని వేడుకున్నాను. బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు.. అతడిని ప్రేమిస్తున్నాను అని చెప్పినా అంగీకరించలేదు. మోనోజిత్ కాళ్లు పట్టుకొని వదిలేయాలని ప్రాధాయపడినా.. వదల్లేదు. ఆ తర్వాత నన్ను సెక్యూరిటీ గార్డు రూమ్‌లోకి బలవంతంగా లాక్కెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. తీవ్ర భయాందోళనకు గురయ్యా. శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడి ఆస్పత్రికి తీసుకెళ్లాలని కోరినా ఎవరూ సహాయం చేయలేదు. ప్రధాన నిందితుడు అత్యాచారం చేస్తుంటే మిగతా ఇద్దరూ వీడియోలను రికార్డు చేశారు. నేను సహకరించకపోతే ఆ వీడియోలను అందరికీ చూపిస్తామని బెదిరించారు. అక్కడి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించిన క్రమంలో హాకీ స్టిక్‌తో దాడి చేశారు. నాకు న్యాయం చేయండి'' అని బాధితురాలు పోలీసులను కోరారు.

### నిందితుల అరెస్టు.. ఫోన్‌లు సీజ్

ఈ ఘటనకు ముందు తనను, మరో ఏడుగురిని క్యాంపస్ లోపల ఉన్న యూనియన్ గదిలోకి పిలిపించారని, అక్కడ మనోజిత్ మిశ్రా వ్యక్తిగత జీవితం, అతడికున్న పలుకుబడి గురించి మాట్లాడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ యూనియన్ పట్ల విధేయతతో ఉండాలని కోరగా.. అందుకు తానూ అంగీకరించానన్నారు. పరీక్షలకు సంబంధించిన ఫారంలను నింపేందుకు విద్యార్థిని బుధవారం మధ్యాహ్నం కాలేజీకి వెళ్లగా.. ఆమెను బంధించి రాత్రివేళ ఈ దుశ్చర్యకు ఒడిగట్టారు. ఆ తర్వాత రాత్రి 10.50 గంటల సమయంలో ఆమెను వదిలిపెట్టగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు కస్బా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి ఫోరెన్సిక్ పరీక్ష కోసం ఘటనా స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నామన్నారు. గురువారం ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా.. శుక్రవారం ఉదయాన్నే మరో నిందితుడిని ఇంట్లో అదుపులోకి తీసుకొని.. వారి నుంచి ఫోన్‌లను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

### * జాతీయ మహిళా కమిషన్ ఆందోళన

ఈ దారుణంపై జాతీయ మహిళా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ దుర్మార్గపు ఘటనను సుమోటోగా తీసుకున్న కమిషన్.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసింది. బాధితురాలికి వైద్య, మానసికపరమైన, న్యాయపరమైన సహకారం అందించాలని కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ సూచించారు. ఈ ఘటనలో తీసుకున్న చర్యలపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కోరారు.

## భారీగా పతనమైన బంగారం ధర: ఒక్కరోజే రూ.930 తగ్గుదల

అంతర్జాతీయంగా సానుకూల పవనాలు వీయడంతో దేశీయ మార్కెట్లో బంగారం ధర పతనమైంది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గడం, అమెరికాచైనా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశాజనక నివేదికలు రావడంతో పెట్టుబడిదారులు బంగారంపై అమ్మకాలకు మొగ్గు చూపారు. దీనికి తోడు లాభాల స్వీకరణ కూడా తోడవడంతో పసిడి ధర ఒక్కరోజే భారీగా దిగివచ్చింది. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.930 తగ్గి రూ.97,670కి చేరింది. గురువారం ముగింపు



ధర రూ.98,600గా ఉన్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. అదేవిధంగా, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా రూ.850 తగ్గి రూ.97,200 వద్ద స్థిరపడింది. గురువారం ఈ రకం బంగారం ధర రూ.98,050గా ఉంది. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను పెంచే కొత్త పరిణామాలు ఏవీ లేకపోవడంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుంచి మదుపరులు తమ లాభాలను స్వీకరిస్తున్నారని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈఓ చింతన్ మెహతా విశ్లేషించారు. "ఇరాన్ సంయమనం పాటించడంతో ముడి చమురు ధరలు కూడా తగ్గాయి. ఇది మార్కెట్‌లో రిస్క్ భయాన్ని తగ్గించి బంగారం ధరలపై మరింత ఒత్తిడి పెంచింది" అని ఆయన వివరించారు. మరోవైపు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశం లేదని ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా బులియన్ ధరల పతనానికి కారణమయ్యాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలహీనపడటంతో పెట్టుబడిదారులు బంగారం నుంచి తమ నిధులను ఈక్విటీలు, క్రిప్టోకరెన్సీల వంటి రిస్క్ ఉన్న ఆస్తుల్లోకి మళ్లిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బంగారం బాటలోనే వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. శుక్రవారం కిలో వెండి ధర రూ.100 తగ్గి రూ.1,03,000కి చేరింది. గురువారం ఈ ధర రూ.1,03,100గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 43.45 డాలర్లు (1.31 శాతం) తగ్గి 3,284.40 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది.

# జగన్‌పై తొందరపాటు చర్యలొద్దు.. పోలీసులకు హైకోర్టు ఆదేశం

* సింగయ్య మృతి కేసులో మాజీ సీఎం జగన్‌కు తాత్కాలిక ఊరట
* నిందితులపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దన్న న్యాయస్థానం
* ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ఏపీ హైకోర్టు
* జగన్‌తో పాటు ఇతరులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై విచారణ
* కేసు తదుపరి విచారణను జులై 1వ తేదీకి వాయిదా




పల్నాడు జిల్లా రెంటపాళ్ల గ్రామంలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనలో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి దాఖలైన క్వాష్ పిటిషన్లపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, నిందితులపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను జులై 1వ తేదీకి వాయిదా వేసింది. పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా సింగయ్య మృతికి వైఎస్ జగనే కారణమంటూ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు క్వాష్ పిటిషన్లు దాఖలు చేసినందున, వారిపై దూకుడుగా వ్యవహరించవద్దని పోలీసు శాఖకు న్యాయమూర్తి సూచించారు. ఈ కేసులో జగన్‌తో పాటు ఆయన కారు డ్రైవర్ రమణారెడ్డి, వ్యక్తిగత సహాయకుడు నాగేశ్వర్ రెడ్డి, వైసీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని, విడదల రజనిలను కూడా పోలీసులు నిందితులుగా చేర్చారు. వారంతా కూడా తమపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో వేర్వేరుగా క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లన్నింటిపై కలిపి న్యాయస్థానం విచారణ జరుపుతోంది. కాగా, జగన్ ప్రచార వాహనం కింద పడటం వల్లే సింగయ్య మృతి చెందాడని చెప్పడానికి స్పష్టమైన వీడియో ఫుటేజ్ అందుబాటులో ఉందని గుంటూరు ఎస్పీ సతీశ్ కుమార్ గతంలో వెల్లడించారు. సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ దృశ్యాలు, స్థానికులు తీసిన వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే జగన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.





## తిరుమల కల్తీ లడ్డూ కేసు... సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక

* రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పణ
* దర్యాప్తు పురోగతి, నిందితుల పిటిషన్ల వివరాలు వెల్లడి
* విచారణకు నిందితులు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆరోపణ
* సాక్షులను బెదిరిస్తున్నారని నివేదికలో పేర్కొన్న సిట్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిట్ తన విచారణ నివేదికను సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించింది. దర్యాప్తులో వెలుగుచూసిన కీలక అంశాలతో కూడిన ఈ నివేదికను రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు అందజేసింది. ఈ కేసు దర్యాప్తులో ఇప్పటివరకు సాధించిన పురోగతిని, నిందితులు వివిధ న్యాయస్థానాలలో దాఖలు చేసిన పిటిషన్ల వివరాలను సిట్ తన నివేదికలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలుస్తోంది. కేసు విచారణ సజావుగా సాగకుండా నిందితులు సృష్టిస్తున్న అడ్డంకుల గురించి కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. దర్యాప్తు ప్రక్రియను అడ్డుకునేందుకు నిందితులు ప్రయత్నిస్తున్నారని సిట్ తన నివేదికలో పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అంతేకాకుండా, ఈ కేసులో మరిన్ని తీవ్రమైన ఆరోపణలను కూడా సిట్ తన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. నిందితులు సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారని సిట్ పేర్కొన్నట్టు సమాచారం. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన దర్యాప్తు బృందం, వాటిని నివేదికలో పొందుపరిచి సుప్రీం కోర్టుకు తెలియజేసింది. సిట్ నివేదికతో ఈ కేసు విచారణ మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

## ఊహించని విధంగా గుడివాడలో ప్రత్యక్షమైన కొడాలి నాని

* చాలా కాలం తర్వాత గుడివాడకు వచ్చిన కొడాలి నాని
* దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం గుడివాడ కోర్టుకు వచ్చిన కొడాలి
* నాని రాకతో కోర్టు ప్రాంగణానికి భారీగా చేరుకున్న వైసీపీ శ్రేణులు



వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి కొడాలి నాని గత ఎన్నికల తర్వాత సుదీర్ఘ విరామం అనంతరం తొలిసారిగా గుడివాడలో ప్రజల మధ్యకు వచ్చారు. ఓ దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆయన శుక్రవారం గుడివాడ కోర్టుకు హాజరయ్యారు. చాలా కాలంగా రాజకీయాలకు, బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న నాని, ఒక్కసారిగా కోర్టు ప్రాంగణంలో కనిపించడంతో వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుకు చెందిన వస్త్ర దుకాణంపై దాడి జరిగిన ఘటనకు సంబంధించి కొడాలి నానిపై కేసు నమోదైంది. ఈ కేసులో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన ముందుగా ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, గుడివాడలోని కింది కోర్టులోనే బెయిల్ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు సూచనల మేరకు, కొడాలి నాని ఈరోజు గుడివాడ కోర్టుకు హాజరై బెయిల్‌కు అవసరమైన పూచీకత్తు పత్రాలను సమర్పించారు. ఇదే కేసుకు సంబంధించి ఇప్పటికే ఆయన అనుచరులు 16 మందికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అయితే, పోలీసుల విచారణ సమయంలో కొందరు అనుచరులు కొడాలి నాని ఆదేశాల మేరకే తాము దాడికి పాల్పడినట్లు అంగీకరించారని సమాచారం. ఎన్నికల ఫలితాల తర్వాత దాదాపు ఏడాది పాటు నియోజకవర్గానికి దూరంగా ఉన్న కొడాలి నాని, ఇప్పుడు కోర్టు వ్యవహారంలో గుడివాడకు రావడంతో స్థానిక రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ఆయన రాక గురించి తెలుసుకున్న వైసీపీ కార్యకర్తలు, అభిమానులు కోర్టు వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో అక్కడ కొంత సందడి వాతావరణం నెలకొంది.

## ఏపీ విద్యాశాఖ కమిషనర్ పై హైకోర్టు ఆగ్రహం

* ఎయిడెడ్ స్కూళ్లలో నియామకాలపై హైకోర్టులో విచారణ
* కోర్టు ఆదేశాలు పాటించలేదని విద్యాశాఖపై పిటిషన్ దాఖలు
* దీనిని కోర్టు ధిక్కరణగా పరిగణించిన న్యాయస్థానం



ఆంధ్రప్రదేశ్‌లో ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నియామకాల జాప్యంపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో విఫలమయ్యారంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో భాగంగా కమిషనర్ విజయ రామరాజు వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరు కావాలని శుక్రవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నియామకాలు చేపట్టేందుకు వీలుగా తగిన మార్గదర్శకాలతో గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ, విద్యాశాఖ అధికారులు ఆ ఉత్తర్వులను అమలు చేయలేదు. దీంతో సంబంధిత పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ వైఖరిని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించాయి. విద్యాశాఖ అధికారులు కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే అమలు చేయడం లేదని, ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, విద్యాశాఖ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల అమలులో జాప్యానికి గల కారణాలను వివరించాలని కమిషనర్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో, జులై 11వ తేదీన వ్యక్తిగతంగా కోర్టు విచారణకు హాజరు కావాలని కమిషనర్ విజయరామరాజుకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

## మిషన్ వాత్సల్య..పీఎం బాల సంరక్షణ యోజన కింద రూ.10 లక్షల ఆర్థిక సాయం



తూర్పుగోదావరి: కొవిడ్ సమయంలో తల్లిదండ్రుల్ని కోల్పోయిన తూర్పుగోదావరి జిల్లా వాసికి కేంద్రం ఆర్థిక సాయం చేసింది. కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన సుమామణికి రూ.10 లక్షల చెక్కును ఏపీ భాజపా అధ్యక్షురాలు పురేందేశ్వరి అందజేశారు. మిషన్ వాత్సల్యపీఎం బాల సంరక్షణ యోజనపీఎం కేర్ కింద ఈ చెక్కును అందజేసిట్లు ఆమె తెలిపారు. ఈ విధంగా కేంద్రం ఆర్థిక సాయం చేయడం దేశంలోనే తొలిసారి. మరో రూ.10 లక్షల వడ్డీ డబ్బులు సుమామణి కుమార్తెకు అందేలా చర్యలు తీసుకున్నట్లు పురందేశ్వరి వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా మిగతా డబ్బులు అందించినట్లు అధికారులు వెల్లడించారు.

## ఆరుగురిని చంపిన అప్పలరాజుకు మరణశిక్ష విధించిన విశాఖ కోర్టు

పెందుర్తి: ఆరుగురిని నరికి చంపిన అప్పలరాజుకు విశాఖ న్యాయస్థానం మరణశిక్ష విధించింది. 2021 ఏప్రిల్ 15న విశాఖ జిల్లా పెందుర్తి మండలం జుత్తాడలో చిన్నారి సహా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని అప్పలరాజు హతమార్చాడు. జుత్తాడలోని బత్తిన, బొమ్మిడి కుటుంబాల మధ్య వివాదాలున్నాయి. ఈ క్రమంలో బొమ్మిడి కుటుంబం ఇంట్లోకి చొరబడిన అప్పలరాజు ఆరుగురిపై కత్తితో దాడి చేశారు.



దొరికిన వారిని దొరికినట్టు నరికిపారేశాడు. హంతకుడు కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన బొమ్మిడి రమణ (63), ఉషారాణి (35), అల్లూరి రమాదేవి(53), నక్కెళ్ల అరుణ (37), బొమ్మిడి ఉదయ్ (2), ఉర్విష (6 నెలలు) ఘటనా స్థలిలోనే మృతి చెందారు. ఘటన తర్వాత నిందితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టుకు సాక్ష్యాధారాలు సమర్పించడంతో నిందితుడికి మరణ శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

## ఏపీ మద్యం కేసు.. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టులో దక్కని ఊరట

అమరావతి: ఏపీ మద్యం కేసులో నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట దక్కలేదు. విజయవాడ ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ ఉండగా.. మధ్యంతర రక్షణ ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. మద్యం కేసులో ఏ39గా ఉన్న మోహిత్‌రెడ్డి ఎఫ్ఐఆర్‌లో తన పేరు తొలగించాలని, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ముందస్తు



బెయిల్ పిటిషన్‌పై దిగువ కోర్టులో విచారణ ఉండగా.. మధ్యంతర రక్షణ ఇవ్వలేమని తేల్చి చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

## నాయుడుపేటలో రూ.112 కోట్లతో సంగం మిల్క్ యూనిట్

అమరావతి: నెల్లూరు జిల్లా నాయుడుపేటలో పరిశ్రమ ఏర్పాటుకు సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. నాయుడుపేటలోని MPSEZలో సంగం సంస్థకు రాయితీపై భూముల కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎకరం రూ.50లక్షల చొప్పున 22.80 ఎకరాలు కేటాయించింది. సంగం సంస్థ రూ.112 కోట్లతో పాలు, పాలు ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను సంగం నెలకొల్పనుంది. యూనిట్ ఏర్పాటు కోసం తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ ఛైర్మన్, ఎండీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు ఇచ్చారు.







ఏ సందర్భానికైనా సిద్ధంగా ఉండాలనుకుంటున్నారు నేటి అమ్మాయిలు. అందుకే ప్రతిసారీ గంటలకొద్దీ సింగారం చాలామంది నైజం కాదిప్పుడు. మీటింగ్, స్నేహితులతో అవుటింగ్, బ్రంచ్... దేనికైనా చిటికెలో సిద్ధమై వెళ్లాలనుకుంటున్నారు. అలాంటివాళ్లు టాప్‌కి మ్యాచింగ్ ప్యాంట్, చున్నీ అంటూ వెతుక్కోవడాన్ని ఇష్టపడతారా? లేదు కదా! అందుకే వాళ్ల ఎంపిక కో ఆర్డ్ సెట్‌లు అవుతున్నాయి. రంగు, ప్యాటర్న్, వస్త్రం... ఇలా డ్రెస్ మొత్తం మ్యాచింగ్ అవ్వడమే వీటి ప్రత్యేకత. నిజానికి కో ఆర్డ్ సెట్‌లు... చాలామంది అమ్మాయిలకు పరిచయమే. అయితే ప్రతిదానిలో ప్రత్యేకతని కోరుకునే అమ్మాయిలు పై నుంచి కిందవరకూ ఒకేలా ఉంటే ఎలా మెచ్చుతారు? సౌకర్యంగా ఉన్నాయి కాబట్టి, రోజువారీగానో, ప్రయాణాలకో ఎంచుకున్నవారే ఎక్కువ. వాటిని మాత్రం ఫ్యాషన్‌కి ఎందుకు దూరం చేయాలనుకున్నారేమో ఇలా షార్ట్ టాప్‌లతో తీసుకొచ్చారు ఫ్యాషనిస్టులు. స్టైలిష్ లుక్‌తో వారెవ్వా అనిపించడం లేదూ? చూడగానే సూట్ అనిపించేలానూ ఉన్నాయి. అంటే పిక్నిక్, పార్టీ, ఆఫీసు... ఏదైనా సంకోచం లేకుండా వేసుకోవచ్చన్నమాట. అందానికి అందం... హుందాకి హుందా... సౌకర్యానికి సౌకర్యం కూడా. పగలు, రాత్రి అన్న పరిధులూ లేవు. కాబట్టే, ఈ ఏడాది కాలేజీ అమ్మాయిలే కాదు, ఆఫీసులకు వెళ్లే, వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే మహిళల ఎంపిక కో ఆర్డ్ సెట్‌లే అయ్యాయి. మరి మీ సంగతేంటి? ఆ జాబితాలోకి చేరిపోయారా? లేదంటే వెంటనే తెచ్చేసుకోండి. సందర్భమేదైనా చకచకా సిద్ధమైపోండి.



# కో ఆర్డ్‌తో ఎప్పుడూ రెడీనే!















# కాపర్ బాటిల్స్‌ని ఇలా శుభ్రం చేయాలట!

**ఆరోగ్యానికి మంచిదని కొంతమంది కాపర్ బాటిల్స్ వాడుతుంటారు. అయితే వీటిని తరచూ ఉపయోగించడం వల్ల.. గాలిలో ఆక్సిజన్‌తో చర్య జరిపి అవి రంగు మారిపోవడం, బాటిల్ అడుగున ఆకుపచ్చగా తయారవడం సహజం. మరి, వీటిని ఎప్పటికప్పుడు తొలగించుకుంటేనే బాటిల్ పరిశుభ్రంగా ఉంటుంది.. ఆరోగ్యానికీ మంచిది. ఇందుకోసం కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగపడతాయంటున్నారు నిపుణులు.**





* ఉప్పు, వెనిగర్ కొద్ది మొత్తాల్లో తీసుకొని పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని బాటిల్ ఉపరితలంపై రుద్దడంతో పాటు.. ద్రావణంలా చేసి బాటిల్ లోపలి భాగాన్ని శుభ్రం చేయాలి. ఫలితంగా బాటిల్ పూర్వపు రంగులోకొస్తుంది.
* నిమ్మరసం, ఉప్పు కలిపి తయారుచేసిన పేస్ట్‌తోనూ కాపర్ బాటిల్/కాపర్ పాత్రల్ని శుభ్రం చేయచ్చు. దీన్ని ఆయా పాత్రలపై పూసి.. మృదువైన క్లాత్‌తో రుద్దడం వల్ల అవి శుభ్రపడతాయి. కొత్తవాటిలా మెరుస్తాయి. ఇక బాటిల్ లోపలి భాగాన్ని శుభ్రం చేయడానికి ఈ మిశ్రమాన్ని ద్రావణంగా చేసుకొని ఉపయోగించాలి.
* కాపర్ బాటిల్‌లో కాస్త వేడిగా ఉన్న నీటిని పోసి.. అందులో కొద్దిగా ఉప్పు, రెండు నిమ్మ చెక్కలు, కాస్త వెనిగర్ వేసి.. అరగంట పాటు పక్కన పెట్టేయాలి. నీళ్లు చల్లారాక.. కాటన్ క్లాత్‌తో లోపలి భాగాన్ని శుభ్రం చేస్తే సరిపోతుంది.
* చింతపండు రసంలో కొద్దిగా ఉప్పు వేసి బాటిల్‌లో పోయాలి. కాసేపటి తర్వాత షేక్ చేస్తూ దీన్ని శుభ్రం చేయాలి. ఇదే చింతపండు గుజ్జుతో బాటిల్ బయటి భాగాన్నీ శుభ్రం చేసి మెరిపించచ్చు.

**ఇవి గుర్తుంచుకోండి!**

* రాగి బాటిల్స్‌ని శుభ్రం చేయడానికి కాస్త వేడిగా ఉన్న నీటిని ఉపయోగిస్తే అవి త్వరగా శుభ్రపడతాయి.
* శుభ్రపరిచే క్రమంలో సహజసిద్ధమైన పదార్థాల్ని ఉపయోగించినప్పటికీ.. చేతులకు గ్లోవ్స్ పెట్టుకోవడం మంచిది. తద్వారా చర్మ అలర్జీలు రాకుండా జాగ్రత్తపడచ్చు.
* పదిహేను రోజులకోసారి బాటిల్స్‌ని శుభ్రం చేయడం వల్ల అవి ఎప్పుడూ కొత్త వాటిలా మెరుస్తాయి.. బాటిల్ కూడా క్లీన్‌గా ఉంటుంది. లేదంటే రుద్ది మరీ కడగాల్సి వస్తుంది.
* బాటిల్స్ లోపలి భాగాన్ని కడిగే క్రమంలో గరుకుగా ఉండే బ్రష్‌లు వాడకూడదు. బయటి భాగానికి కూడా స్క్రబ్బర్లు ఉపయోగించకపోవడమే మంచిది. ఎందుకంటే వీటివల్ల బాటిల్‌పై గీతలు పడే అవకాశం ఉంటుంది. కాబట్టి మృదువైన కాటన్ క్లాత్‌తో వీటిని శుభ్రం చేయాలి.
* అన్ని పాత్రల్లా వీటిని గాలికి ఆరబెట్టకూడదు. కడిగిన వెంటనే పొడి వస్త్రంతో తుడవడం వల్ల అవి ఆక్సిడేషన్ ప్రక్రియకు లోను కావు.. అలాగే బాటిల్‌పై నీటి మరకలు పడకుండానూ జాగ్రత్తపడచ్చు.
* ఎండలో, వేడి ఎక్కువగా ఉండే ప్రదేశంలో వీటిని ఉంచకూడదు.

# వానల్లో మొక్కల సంరక్షణ...

**వానాకాలం మొదలైందంటే చాలు... ఎండిన, మోడువారిన మొక్కలన్నీ మళ్లీ చిగురిస్తాయి. కానీ, తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే... మరికొన్ని ఇబ్బందులూ తలెత్తుతాయి.**

* తరచూ వర్షాలు పడుతుంటే మొక్క చుట్టూ మట్టిలో నీళ్లు నిలిచిపోతుంటాయి. దీంతో దోమలు, ఇతర కీటకాలు, తెగుళ్లు వ్యాపించేందుకు అనువైన ప్రదేశంగా అది మారుతుంది. అందుకే, అదనంగా వచ్చే నీరు బయటికి పోయే ఏర్పాటు చేయండి. ఆకులు కుళ్లుతుంటే వాటిని వెంటనే కత్తిరించడం మంచిది. సేంద్రియ ఫంగిసైడ్‌ని వాడితే తెగుళ్లను నివారించవచ్చు.
* ఈ కాలంలో తరచూ తడవడం, నీటిలో నానడం వల్ల మొక్కలకు వేరు తెగుళ్లు వచ్చే అవకాశం ఎక్కువ. ఈ ఇబ్బందిని అధిగమించడానికి మట్టిలో ఇసుక లేదా పర్లైట్ మిశ్రమాన్ని కలపండి.
* ఆకాశం మబ్బుగా ఉండటం వల్ల తగినంత వెలుతురు రాకపోవచ్చు. దీంతో మొక్కల పెరుగుదల మందగిస్తుంది. అవసరమైతే కృత్రిమ వెలుతురుని అందించాలి. స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్స్‌ని ప్రతి పదిహేను రోజులకోసారి ఇవ్వాలి. అప్పుడే ఆరోగ్యంగా ఎదుగుతుంది.



# నిధి అగర్వాల్ వింత అలవాటు..

## రాత్రిళ్లు అవి చూడాల్సిందేనట..!



టాకీస్: సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే టాలీవుడ్ హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. సినిమాలకు సంబంధించిన అప్డేట్స్‌తో పాటు, తన గ్లామరస్ ఫోటోషూట్స్‌తో తరచూ నెట్టింట్లో హల్‌చల్ చేస్తూ ఉంటుంది. అంతేకాక, అభిమానులతో చిట్‌చాట్ చేసి ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేయడంలోనూ నిధి ముందుంటుంది. తాజాగా, ప్రతి రోజు రాత్రి తానే చేసే ఒక ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకుంది. రాత్రి సమయంలో నాకు ఒక మర్డర్ మిస్టరీ సినిమా లేదా వెబ్ సిరీస్ చూడడం అలవాటుగా మారింది. కానీ ఇప్పుడు కొత్త కంటెంట్ దొరకడం లేదు. దయచేసి నాకు మంచి మర్డర్ మిస్టరీలు సజెస్ట్ చేయండి. ఏ భాష అయినా సరే! అని నిధి తన ట్వీట్ ద్వారా ఫ్యాన్స్‌ను కోరింది. నిధి ట్వీట్ కు నెటిజన్ల నుంచి ఆశించినంత రెస్పాన్స్ వచ్చిందనే చెప్పాలి. కానీ చాలా మంది కాస్త సెటైరిక్ మూడ్‌లోనే ఆమెకి రిప్లై ఇచ్చారు. రాధే శ్యామ్, బ్రహ్మోత్సవం,ఆచార్య , అజ్ఞాతవాసి సినిమాలు మర్డర్ మిస్టరీలే అంటూ కామెంట్ చేశారు. ఇక "హరి హర వీరమల్లు" సినిమా ఇప్పటివరకు విడుదల కాకపోవడం కూడా మర్డర్ మిస్టరీ అయిపోయిందని ఓ అభిమాని ఫన్నీగా స్పందించాడు. మరికొందరు "ఆదిపురుష్", "ఫ్యామిలీ స్టార్", "శక్తి", "స్పైడర్", "వరుడు", "భోళా శంకర్" వంటి సినిమాల పేర్లను మర్డర్ మిస్టరీలు అంటూ సజెస్ట్ చేశారు.

ఇక మేఘాలయ హనీమూన్ కేసు, తేజేశ్వర్ మర్డర్ కేసులాంటివి అసలైన మర్డర్ మిస్టరీలని, వాటి గురించి తెలుసుకోమంటూ కొందరు సలహాల ఇచ్చారు. ఇస్మార్ట్ శంకర్ చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న నిధి అగర్వాల్ ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరి హర వీరమల్లు చిత్రంలో కథానాయికగా నటిస్తుంది. అలానే రెబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ది రాజా సాబ్ సినిమాల్లో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రెండు సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్నాయి.హరి హర వీరమల్లు సినిమా జూలై 24, 2025న విడుదలకు సిద్ధమవుతుండగా, ది రాజా సాబ్ మూవీ డిసెంబర్ 5, 2025న థియేటర్లలోకి రానుంది. ఈ రెండు సినిమాల తర్వాత తన కెరీర్ మరో మలుపు తిరుగుతుందన్న ఆశాభావం నిధిలో కనిపిస్తోంది.

# యోధురాలిగా రష్మిక సరికొత్త అవతారం

**రష్మిక మందన్న కొత్త పాన్ ఇండియా చిత్రం 'మైసా'**
**యోధురాలిగా సరికొత్త అవతారంలో నేషనల్ క్రష్**
**ఐదు భాషల్లో రానున్న ఈ చిత్రానికి రవీంద్ర పూలే దర్శకత్వం**
**మునుపెన్నడూ చేయని భిన్నమైన పాత్రలో రష్మిక**




టాకీస్: నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో వేగం పెంచారు. ఇటీవలే 'కుబేర' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈ అందాల భామ, ఇప్పుడు మరో ఆసక్తికరమైన పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'మైసా' అనే పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమాలో రష్మిక మునుపెన్నడూ కనిపించని సరికొత్త పాత్రలో దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

ఈ చిత్రానికి రవీంద్ర పూలే దర్శకత్వం వహించనుండగా, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. తెలుగుతో పాటు మరో నాలుగు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో 'మైసా' విడుదల కానుంది. చిత్ర బృందం విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో రష్మిక యోధురాలిగా, అత్యంత భయంకరమైన అవతారంలో కనిపించారు. "ధైర్యం ఆమె బలం. సంకల్పంలో లేదు కనికరం.. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి" అనే శక్తివంతమైన వ్యాఖ్యను పోస్టర్‌కు జోడించి మేకర్స్ సినిమాపై అంచనాలను పెంచారు.

ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి రష్మిక స్పందిస్తూ... "నేను ఎప్పుడూ కొత్తదనం, వైవిధ్యం ఉన్న కథలకే ప్రాధాన్యత ఇస్తాను. 'మైసా' అలాంటి చిత్రమే. ఇది నేను ఇంతకు ముందెన్నడూ చేయని పాత్ర, అడుగుపెట్టని ప్రపంచం. ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే" అని ఆమె తెలిపారు.

ఇక, ప్రస్తుతం రష్మిక కెరీర్ విజయవంతంగా సాగుతోంది. ఇటీవల విడుదలైన 'కుబేర' చిత్రం కూడా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరి ఆమె విజయాల జాబితాలో చేరింది. ప్రస్తుతం ఆమె లైనప్‌లో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో లేడీ ఓరియెంటేడ్ చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తున్నారు. దీంతో పాటు బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే అతీంద్రియ శక్తులతో కూడిన రొమాంటిక్ చిత్రంలోనూ కనిపించనున్నారు. ఇప్పుడు 'మైసా' ప్రకటనతో ఆమె ఖాతాలో మరో భారీ చిత్రం చేరినట్లయింది.



# ఐకానిక్ సాంగ్ రీ క్రియేట్..

## 'ఛయ్యా ఛయ్యా' పాటకు స్టెప్పులేసిన మలైకా అరోరా

టాకీస్: 'చల్ ఛయ్యా.. ఛయ్యా'.. 'చల్ ఛయ్యా.. ఛయ్యా' అనే పాట గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఈ పాట 90స్‌లో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ అందరినీ ఒక ఊపు ఉపేసింది. బాలీవుడ్ కథానాయకుడు షారుక్ ఖాన్, మనీషా కోయిరాలా జంటగా నటించిన 'దిల్ సే' చిత్రంలోనిదే ఈ పాట. మణిరత్నం తెరకెక్కించిన ఈ చిత్రంలో మలైకా ఆరోరా ఈ ప్రత్యేక గీతంలో తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగించింది. అయితే ఇదే పాటను ఇప్పుడు రీ క్రియేట్ చేసింది మలైకా ఆరోరా. తన ఎక్స్ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ కపూర్ పుట్టినరోజు సందర్భంగా ఒక బర్త్‌డే పార్టీని ఏర్పాటు చేయగా.. ఈ పార్టీలో 'చల్ ఛయ్యా.. ఛయ్యా' పాటకు అదిరిపోయో స్టెప్పులేసింది మలైకా. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. అయితే ఈ వీడియో పాతదని తెలుస్తుంది. కాగా ఈ వీడియోను మీరు కూడా చూసేయండి.

# రూట్ మార్చిన రామ్ పోతినేని

**టాకీస్:** టాలీవుడ్ ట్రెండ్ మారింది. లవ్ స్టోరీస్, యాక్షన్ ఎపిసోడ్లను పక్కకు పెట్టి హారర్, మైథాలజీ, సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రాల వైపుగా అడుగులేస్తోంది. హనుమాన్, విరూపాక్ష, పొలిమేర, కల్కి చిత్రాలను ఆడియన్స్ కొత్తగా ఫీలై హిట్స్ ఇవ్వడంతో వీటిపై నిర్మాతలు, దర్శకులు దృష్టి పెడుతున్నారు. ఇక ఇండస్ట్రీలో ఏది నడిస్తే అదే ఫాలో అవ్వాల్సిన పరిస్థితి హీరోలది. ట్రెండ్‌కు తగ్గట్టుగా మారిపోతున్నారు. చిరంజీవి విశ్వంభర, ప్రభాస్.. నిఖిల్ స్వయంభు, తారక్-త్రివిక్రమ్ కథలు సోషియో ఫాటసీ అండ్ మైథాలజీ రిలేటెడ్ ఫిల్మ్ చేస్తున్నారు. మైథాలజీ మాత్రమే కాదు సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రాలకు సై అంటున్నారు హీరోస్. ముఖ్యంగా బ్లాక్ మ్యాజిక్, అతీంద్రియ శక్తులు వంటి కాన్సెప్టులపై ఇంట్రస్ట్ చూపిస్తున్నారు. ఇప్పుడు ఈ జోనర్‌లోకి ఎంటర్ కాబోతున్నారు రామ్ పోతినేని. మాస్ ఇమేజ్ కోసం పరుగులెత్తి యూ టర్న్ తీసుకున్న రామ్ ఇప్పుడు అతీంద్రియ శక్తుల కాన్సెప్ట్ కథతో రాబోతున్నాడట. ఈ కథ ఫస్ట్ రానా నుండి చైతూ ఆపై రామ్ దగ్గరకు వచ్చినట్లు తెలుస్తోంది. కిశోర్ అనే కొత్త దర్శకుడి ఛాన్స్ ఇస్తున్నాడట రామ్. ఈ సినిమాను ఆర్కా మీడియా నిర్మిస్తుండగా రానా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆంధ్రా కింగ్ తాలూకాతో బిజీగా ఉన్న ఈ ఎనర్జటిక్ స్టార్ ఈ ఇయర్‌ఎండింగ్ నుండి ఈ ప్రాజెక్టును పట్టలెక్కించనున్నాడని టాక్. మొత్తానికి టాలీవుడ్ మారుతోంది.




# భక్తిరసాన్ని ఈ తరానికి పంచిన కన్నప్ప

**టాకీస్:** మంచు విష్ణు కలల ప్రాజెక్ట్‌గా భారీ తారాగణంతో రూపొందిన...సినీ ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూసిన 'కన్నప్ప' చిత్రం ఎట్టకేలకు థియేటర్‌లో విడుదలైంది. అలనాటి కృష్ణంరాజు 'భక్తకన్నప్ప'కు విష్ణు 'కన్నప్ప'లో ఉన్న కొత్తదనం ఏమిటి... ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ తదితర నటీనటుల అతిథి పాత్రలు సినిమాకు ఎలాంటి అదనపు బలాన్ని ఇచ్చాయన్న ఆసక్తి ఆదినుంచి ప్రేక్షకుల్లో ఉంది. మహాకవి ధూర్జటి రాసిన కథ ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంది. అడవిలో ఓ చిన్న గూడెంలో పుట్టి పెరిగిన తిన్నడు (మంచు విష్ణు) చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో అన్నీ తానై పెంచుతాడు తండ్రి నాథనాథుడు (శరత్‌కుమార్). తిన్నడు తన చిన్ననాట జరిగిన ఓ సంఘటనతో నాస్తికుడిగా మారిపోతాడు. దేవుడు లేడని నమ్ముతుంటాడు. విలు విద్యలో తిరుగులేని తిన్నడు తానుండే గూడెంతోపాటు, చుట్టుపక్కల గూడేలకు ఏ ఆపద వచ్చినా ముందుంటాడు. ఆ గూడేల్లో అనాదిగా ఓ ఆనవాయితీ ఉంటుంది. ఆపద వచ్చిన ప్రతిసారీ అందరూ క్షేమంగా ఉండాలని అక్కడ వెలసిన అమ్మవారికి ఒకరిని బలి ఇస్తుంటారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి గూడెం నుంచి బహిష్కరణకి గురవుతాడు తిన్నడు. మనసిచ్చిన నెమలి (ప్రీతి ముకుందన్) అతని వెంట నడుస్తుంది. అలా నాస్తికుడిగా వెళ్లిన తిన్నడు, గొప్ప శివ భక్తుడిగా ఎలా మారిపోయాడు? తిన్నడు అలా మారిపోవడానికి కారకుడైన రుద్ర ఎవరు? తిన్నడు భక్తుడిగా మారిపోయాక తన శివయ్య కోసం ఏం త్యాగం చేశాడు? అతనికి భక్త కన్నప్పగా పేరు రావడం వెనక కథేమిటి? పార్వతీదేవి శ్రీకాళహస్తిలో జ్ఞాన ప్రసూనాంబికగా ఎలా వెలసింది?ఎవరి చూపు పడనీయకుండా వాయులింగాన్ని కాపాడుకుంటూ వస్తున్న మహాదేవశాస్త్రి (మోహన్‌బాబు)ఎవరు?తదితర విషయాల్ని హృద్యంగా



చిత్రీకరించారు. నేటి తరానికి అర్థమయ్యే రీతిలో కన్నప్పను తెరకెక్కించారు. భక్త కన్నప్ప జీవిత కథ చాలామందికి తెలిసిందే. ఇదివరకే తెరకెక్కి, విజయాన్ని అందుకున్న గొప్ప కథ. భక్తి, భావోద్వేగాలే ఇందులో కీలకం. కన్నప్ప జీవితంలోని భక్తి సారాన్ని తెరపైకి తీసుకురావడంలో ఈ చిత్రం విజయవంత మైంది. ఈ తరాన్ని ఆకట్టుకునేలా బలమైన సాంకేతిక హంగులు, అడుగడుగునా ఆకర్షించే తారాగణంతో ఈ సినిమాని తీర్చిదిద్దారు. ప్రథమార్థం సినిమా తిన్నడులోని వీరుడిని ఆవిష్కరించగా, ద్వితీయార్థం అతనిలోని భక్తుడిని తెరపై చూపించింది. ముఖ్యంగా సెకండాఫ్ ఈ సినిమాని మరో స్థాయిలో నిలబెడుతూ, భక్త కన్నప్ప జీవితకథకి పూర్తిగా న్యాయం చేసింది. తిన్నడు బాల్యంతో అసలు కథ మొదలవుతుంది. చిన్నప్పటి తిన్నడుగా మంచు విష్ణు తనయుడు అవ్రామ్ తెరపై సందడి చేశారు. శ్రీకాళహస్తి పురాణాన్ని చెప్పే పాటలో మంచు విష్ణు కుమార్తెలు కనిపిస్తారు. గూడెంలో తిన్నడు జీవితం, అతని సాహసాలు, నెమలితో ప్రేమాయణం, మధ్యమధ్యలో పార్వతీ పరమేశ్వరుల ముచ్చట్లతో ప్రథమార్థం సాగిపోతుంది. విరామానికి ముందు సన్నివేశాలు సినిమాని ఆసక్తికరంగా మార్చేశాయి. తిన్నడుకీ, ద్వాపరయుగానికీ మధ్య సంబంధాన్ని ఆవిష్కరించే సన్నివేశాలు, కిరాతుడిగా మోహన్‌లాల్ పాత్ర పరిచయం ద్వితీయార్థంపై ఆసక్తిని పెంచుతాయి. ద్వాపరయుగంలో తిన్నడు, కిరాతుడు ఎవరనే సన్నివేశాలు మొదలుకొని వాయులింగం చుట్టూ తిరిగే ఎపిసోడ్.. తిన్నడు, అతని తండ్రి నేపథ్యంలో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు, తన తండ్రిని చంపిన శత్రువుపై తిన్నడు చేసిన యుద్ధం... ఇలా ప్రతిదీ ఆసక్తికరమే. ఇదంతా ఒక ఎత్తయితే, ప్రభాస్ వచ్చాక సినిమా మరో ఎత్తు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.